తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
ఆదివారం
18 అక్టోబర్ 2026
పేజీలు : 8
Follow :

## వీణవంకలో గంజాయి
# కలకలం

**ముగ్గురు యువకులకు పరీక్షల్లో పాజిటివ్**

**గంజాయి సేవించినట్లు నిర్ధారణ..**

**డీ-అడిక్షన్ కేంద్రానికి తరలింపు**



**వీణవంక అక్టోబర్ 17(జనంసాక్షి)**
వీణవంక గంజాయి సేవించినట్లు ముగ్గురు యువకులను గుర్తించిన వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి,తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం వీణవంక పోలీస్ స్టేషన్ సిబ్బంది వీధిలో భాగంగా పెట్రోలింగ్ వీణవంక మండలం లోని ఘన్ముకుల గ్రామ శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, సమీపంలో అనుమానాస్పదంగా ఒకే చోట కూర్చున్న ముగ్గురు యువకులను గుర్తించారు. పోలీసులను గమనించిన వారు అక్కడి నుంచి వెళ్లిపోవడానికి ప్రయత్నించగా, పోలీసు సిబ్బంది వారిని అదుపులోకి తీసుకొని విచారించారు.విచారణలో మండలంలోని ఘన్ముకుల గ్రామానికి చెందిన గజుల సన్నీ(21),కనుకుంట్ల రుత్విక్ (20),గజుల సిద్ధార్థ (19)గా గుర్తించారు.వారు గంజాయి సేవించినట్లు విచారణలో వెల్లడించగా, పోలీసుల సమక్షంలో నిర్వహించిన యూరిన్ డ్రగ్ స్క్రీనింగ్ పరీక్షలో టి హెచ్ సి(గంజాయి)కు సంబంధించి పాజిటివ్ ఫలితాలు వచ్చినట్లు తెలిపారు.ఈ ఘటనకు సంబంధించి పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి,వారికి సంబందిత వైద్య పరిక్షలు జరిపించి వారిని న్యాయస్తానం ముందు హాజరు పరచటం జరిగింది,అక్కడి నుండి వారిని మార్పు కొరకు De-Adiction centre కు తరలించినట్టు వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.



## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు
# ప్రతీక బతుకమ్మ పండుగ

**ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు: కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, అక్టోబర్ 17 (జనంసాక్షి);**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బతుకమ్మ సంబురాలు శనివారం వైభవంగా నిర్వహించారు. జిల్లా సంక్షేమ శాఖ ఆద్వర్యంలో సమీకృత కార్యాలయాల సముదాయంలో మహిళా ఉద్యోగులు, సిబ్బంది రంగురంగుల పూలతో బతుకమ్మలను సిద్ధం చేశారు.ఈ సందర్భంగా బతుకమ్మ సంబురాలు నిర్వహించగా, జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి, బతుకమ్మ పాటలకు మహిళా అధికారులు, సిబ్బందితో కలిసి ఆడిపాడారు.జిల్లా ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు కలెక్టర్ తెలియజేశారు. వివిధ శాఖల ఆద్వర్యంలో బతుకమ్మలు తీర్చిదిద్దారు. మొదటి బహుమతి జిల్లా వ్యవసాయ శాఖకు రాగా, రెండో బహుమతి రెవెన్యూ శాఖకు, మూడో బహుమతి శాఖకు ఎం పీ పీ ఎస్ తంగళ్లపల్లి కి వచ్చింది. ఈ సందర్భంగా విజేతరకు జిల్లా కలెక్టర్ బహుమతులు అందజేసి,అభినందించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉద్యోగులు, సిబ్బంది ఉత్సాహంగా బతుకమ్మను అందంగా తీర్చిదిద్ది ఆడి పాడారని కొనియాడారు. వేములవాడలో సద్దుల బతుకమ్మ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించామని, ఆదివారం సిరిసిల్లలో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నామని వివరించారు. ముందస్తుగా అందరికీ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, వేములవాడ ఆర్డీవో కే ఎస్ బీ కుమారి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, వివిధ శాఖల జిల్లా అధికారులు అఫ్జల్ బేగం, సౌజన్య, ఏంజెలాగ్రేస్ఫుడ్, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.



## బతుకమ్మ ఆడితే ఊరుకునేది లేదు

**○ఆధునిక యుగంలోనూ తప్పని కుల వివక్ష**

**○జైతాపూర్ గ్రామంలో ఘటన**

**ఎడపల్లి, ఆగస్టు 17 ( జనంసాక్షి ) :**
ఆధునిక యుగంలో మనుషులు ఓవైపు అంతరిక్షంలోకి అడుగులు పెట్టి కొత్త పంథాకు శ్రీకారం చుడతుండగా మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో కుల వివక్షకు కుటుంబాలు బలైపోతున్న సంఘటన కలకలం రేపుతుంది. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జైతాపూర్ గ్రామానికి చెందిన ఎస్సి కులానికి చెందిన యువకుడు ముదిరాజ్ కులానికి చెందిన యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. అయితే ఈనెల 18వ తేదీన గ్రామంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించేందుకు **వార్తా లోపలి పేజీలో**



## నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

వార్తా లోపలి పేజీలో

## మంథనిలో నేడు
## మంత్రి శ్రీధర్ బాబు పర్యటన

**మంథని, అక్టోబర్ 17, (జనంసాక్షి ):**
రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదివారం మంథనిలో పర్యటించి, 302 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు, 600 మందికి కుట్టు శిక్షణ సర్టిఫికెట్లు పంపిణీ చేయనున్నారు. ఉదయం 9 గంటలకు మంథనిలో పలు కార్యక్రమాలకు హాజరుకానున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో అలీఫ్, డీఆర్డీఏ, మెప్మా, సీఎస్ఆర్ సంస్థల సహకారంతో కుట్టు శిక్షణ పూర్తి చేసిన 600 మందికి మంత్రి చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేయనున్నారు. నియోజకవర్గవ్యాప్తంగా ఇప్పటివరకు 3,040 మందికి ఉచిత కుట్టు శిక్షణ అందించి, సర్టిఫికెట్లు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదే కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన సుమారు కోటి రూపాయల విలువైన ఆర్థిక సహాయాన్ని 302 మంది లబ్ధిదారులకు చెక్కుల రూపంలో మంత్రి చేతుల మీదుగా అందజేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు మెప్మా ఆధ్వర్యంలో మహిళా ఇందిరా శక్తి పథకం కింద మంజూరైన నూతన ఆయిల్ మిల్లును మున్సిపల్ కార్యాలయం మార్గంలో ప్రారంభించనున్నారు. అనంతరం మహాలక్ష్మి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకోనున్నారు.

## ఒక పూట కూర కోసం
# ఏడేళ్లు జైలు పాలు కావద్దు!

**అడవిలో కరెంటు తీగలు పెట్టి మీ కుటుంబాలను రోడ్డున పడేయొద్దు**

**ఇందల్వాయి, అక్టోబర్ 17 (జనంసాక్షి):**
ఇందల్వాయి మండల అటవీ రేంజ్ పరిధిలోని కొండాపూర్ బీట్ అటవీ ప్రాంతంలో అనుమానితులు సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో అటవీ రేంజ్ అధికారి (ఎఫ్ఆర్ఓ) రవిమోహన్ భట్ ఆధ్వర్యంలో అటవీ అధికారులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. అడవిలో చెట్టు చెట్టు తిరుగుతూ క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు.



**వార్తా లోపలి పేజీలో**






## అడవి లింగాల వద్ద బ్రిడ్జి పెచ్చులూడి
# ప్రమాదకరంగా మారిన రహదారి

**కుంగిపోయిన వంతెన భయంతో ప్రయాణిస్తున్న వాహనదారులు**

**ఎల్లారెడ్డి అక్టోబర్ 17 జనంసాక్షి**
ఎల్లారెడ్డి: కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం అడవి లింగాల గ్రామ శివారులోని వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెన ఒకవైపు పూర్తిగా కుంగిపోయి, సిమెంట్ స్లాబులు విరిగిపోయి కిందకు జారిపోయాయి. వంతెన పక్కన ఉన్న రక్షణ గోడ కూడా పగుళ్ల బారి ప్రమాదం అంచున ఉంది.ఈ రహదారి గుండా ప్రతిరోజు వందలాది వాహనాలు, పాఠశాల విద్యార్థులు, రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన కుంగిన విషయం తెలియక రాత్రి వేళల్లో వస్తే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని **వార్తా లోపలి పేజీలో**



## ఘనంగా బతుకమ్మ సంబరాలు

**సిరికొండ 17 అక్టోబర్ జనంసాక్షి**

సిరికొండ మండలంలోని రావుట్ల గ్రామంలో శనివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి మహిళలు పూజించారు. సంప్రదాయ పద్ధతిలో పండుగ సందర్భంగా మహిళలు పాటలు పాడుతూ చప్పట్లతో నృత్యాలు చేశారు. ప్రధాన వీధుల్లో ఊరెంగిపుగా వెళ్ళి ,చెరువులో నిమజ్జనం చేశారు.పాడి పంటలతో సుఖ సంతోషాలతో చల్లంగా చూడాలని బతుకమ్మ ను వేడుకున్నారు.కార్యక్రమంలో విడిసి సభ్యులు ప్రజా ప్రతినిధులు, మహిళలు తదితరులు ఉన్నారు.

## కాచాపూర్ లో బెల్ట్ షాపులను మూసివేయాలి యువకులు ఫిర్యాదు



**భిక్కనూరు అక్టోబర్ 17 (జనంసాక్షి):**

భిక్కనూరు మండలంలోని కాచాపూర్ గ్రామంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్ షాపులను నిర్మూలించాలి అని శనివారం గ్రామ యువకులు ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామ యువకులు మాట్లాడుతూ గ్రామంలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయని. గ్రామంలో మద్యం బెల్ట్ షాపుల నిర్వహణ వల్ల మధ్యతరగతి కుటుంబాలలో ఉదయం లేచిన నుండి మద్యం కొనుగోలు చేసి మద్యానికి బానిసై వారి కుటుంబాల్లో గొడవలు జరుగుతున్నాయి. గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలు అరికట్టడంలో ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గ్రామ యువకులు మెట్టు సందీప్,కామినేని సంతోష్ రెడ్డి,ముత్యాల నవీన్ చారి,పూస శంకర్ మర్రి మహిపాల్ తదితరులు పేర్కొన్నారు.

## మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

**జనం సాక్షి నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం 17 అక్టోబర్**

సిరికొండ మండలంలోని గోపయ్య తాండ,సర్పంచ్ తాండ, గడ్డమిద తండా. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో (బి వి ఎల్) బంజారా లీగ్ వాలీబాల్ టోర్నమెంట్ శనివారం ఇందల్వాయి రేంజ్ ఆఫీసర్ రవి మోహన్ బట్ బహుజన టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం సంతోష్ నాయక్ ప్రారంభించారు. ఇందల్వాయి (ఎఫ్ ఆర్ వో) రవి మోహన్ బట్ ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు అనంతరం మాట్లాడుతూ. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీరక దృఢత్వానికి తోడ్పడతాయని యువకులు చెడు వ్యాసనాలకు మత్తు పదార్థాలకు బానిస కాకుండా క్రీడల పట్ల మక్కువ పెంచుకొని రానిచ్చినట్లయితే ఉన్నత స్థాయికి చేరుతారని అన్నారు. సర్పంచులు. శోభ జీవన్ నాయక్. కేతావత్ రామ్ సింగ్. కే తిరుపతి. వీడీసీ చైర్మన్లు మాజీ సర్పంచులు. నాయకులు గ్రామస్తులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



## బతుకమ్మ ఆడితే ఊరుకునేది లేదు

ఎస్సి కలానికి చెందిన కుటుంబ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఇది గమనించిన ముదిరాజ్ సంఘం ప్రతినిధులు గ్రామంలో తమ ఆడపడుచును వివాహం చేసుకున్నందుకు బతుకమ్మను ఆడే ప్రసక్తే లేదని హెచ్చరించినట్లు సమాచారం. ఈ విషయాన్ని బాధిత కుటుంబ సభ్యులు తెలంగాణ లోకల్ ఫోర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు డల్లా సురేష్ నవోదయన్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ మేరకు గ్రామంలో బతుకమ్మ వేడుకలను ఎట్టి పరిస్థితుల్లో నిర్వహించడం జరుగుతుందని అయితే ప్రస్తుత సమాజంలో కూడా కుల వివక్ష పాటించడం సిగ్గుచేటు అన్నారు. విషయం తెలుసుకున్న ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ జైతాపూర్ సర్పంచ్ నాగుల రాజు గౌడ్ ఆధ్వర్యంలో ముదిరాజ్ ప్రతినిధులు సంఘం నాయకులతో సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సావిత్రి, పోషకల, గ్రామ కమిటీ అధ్యక్షులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**కుల వ్యవక్ష చూపిస్తే ఆందోళన తప్పదు**

**టిఎల్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు డల్లా సురేష్ నవోదయన్**

ప్రస్తుత ఆధునిక యుగంలో గ్రామాలలో ఇంకా కుల వ్యవస్థ రూపుమాపలేదని అయితే కుల వ్యవస్థ చూపిస్తే మాత్రం ఆందోళన బాట పట్టాసి వస్తుందని పట్టాల్సి వస్తుందని తెలంగాణ లోకల్ కోర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు డల్లా సురేష్ నవోదయన్ హెచ్చరిం చారు. జైతాపూర్ గ్రామంలో ఎస్సీ వర్గానికి చెందిన కుటుంబం ఎట్టి పరిస్థితుల్లో బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## అడవి లింగాల వద్ద బ్రిడ్జి పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన రహదారి

గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే వంతెనకు మరమ్మతులు చేయించాలని, తాత్కాలికంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఒక పూట కూర కోసం ఏడేళ్లు జైలు పాలు కావద్దు!

ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ రవిమోహన్ భట్ మాట్లాడుతూ.. ఒక పూట కూర కోసం ఏడేళ్లు జైలు పాలు కావద్దని సూచించారు. అడవిలో ఏర్పాటు చేసే కరెంటు తీగలు తోటి మనుషుల ప్రాణాలతో పాటు వన్యప్రాణులకూ ముప్పుగా మారుతాయని హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడి జైలు పాలైతే మీ పిల్లల భవిష్యత్తు రోడ్డున పడుతుందని పేర్కొన్నారు. అటవీ భూములను ఆక్రమించినా, టేకు చెట్లను నరికినా, వన్యప్రాణులను వేటాడినా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అటవీ సంపదను, వన్యప్రాణులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ గాలింపు చర్యల్లో సెక్షన్ అధికారి, బీట్ అధికారులు పాల్గొని అటవీ ప్రాంతమంతా తనిఖీలు నిర్వహించారు.

## ఐఐటీ బీహెచ్‌యూలో సీటు సాధించిన బంజపల్లి ముద్దుబిడ్డ కరణం ఆదిత్యకు ఘన సత్కారం

- ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో లోహశాస్త్ర ఇంజినీరింగ్‌లో ప్రవేశం..
- విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్

**నిజాంసాగర్, అక్టోబర్ 17 (జనంసాక్షి):**

నిజాంసాగర్ మండలంలోని బంజపల్లి గ్రామానికి చెందిన కరణం ఆదిత్య ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ బీహెచ్‌యూ (వారణాసి)లో లోహశాస్త్ర ఇంజినీరింగ్ విభాగంలో సీటు సాధించి గ్రామానికి, కుటుంబానికి గర్వకారణంగా నిలిచాడు. విద్యారంగంలో ఉన్నత లక్ష్యాన్ని చేరుకున్న ఆదిత్యను జుక్కల్ నియోజకవర్గ శాసనసభ్యుడు తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఘనంగా సత్కరించి అభినందించారు. బంజపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కరణం శ్రీనివాస్ కుమారుడైన ఆదిత్య ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో ప్రవేశం పొందడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కఠినమైన పోటీని అధిగమించి ఐఐటీలో సీటు సాధించడం విద్యార్థి పట్టుదలకు, కృషికి నిదర్శనమని పలువురు పేర్కొంటున్నారు.

**శాలువాతో సత్కరించి అభినందనలు**

ఐఐటీ బీహెచ్‌యూలో ప్రవేశం సాధించిన కరణం ఆదిత్యను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థి సాధించిన విజయాన్ని వారు ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉన్నత విద్యలో రాణిస్తూ కుటుంబానికి, గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.





**విద్యార్థులకు ఆదిత్య విజయం స్ఫూర్తిదాయకం**

ప్రతిభ, పట్టుదల, నిరంతర కృషి ఉంటే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని కరణం ఆదిత్య విజయం నిరూపిస్తోంది. దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఐఐటీలో ప్రవేశం సాధించడం సాధారణ విషయం కాదని, అందుకోసం విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ తమ లక్ష్యాలపై దృష్టి సారించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు సైతం జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో ప్రవేశాలు సాధిస్తూ తమ ప్రతిభను చాటుకోవడం సంతోషకరమైన విషయమని పేర్కొంటున్నారు. ఆదిత్య సాధించిన విజయం బంజపల్లి గ్రామంతో పాటు నిజాంసాగర్ మండలంలోని ఇతర విద్యార్థులకు కూడా ప్రేరణగా నిలవనుంది.

**ఉజ్వల భవిష్యత్తుకు శుభాకాంక్షలు**

కరణం ఆదిత్య తన విద్యాభ్యాసంలో మరింతగా రాణించి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, శ్రేయోభిలాషులు ఆకాంక్షిస్తున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రజాప్రతినిధులు ప్రోత్సహించడం ఇతర విద్యార్థుల్లోనూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని పలువురు పేర్కొన్నారు.ఐఐటీలో సీటు సాధించి బంజపల్లి గ్రామానికి గర్వకారణంగా నిలిచిన కరణం ఆదిత్యకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

## జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్ హెచ్ ఎం) ఉద్యోగస్తులకు కామారెడ్డి శాసనసభ్యులు వెంకటరమణారెడ్డి మద్దతు

**కామారెడ్డి అక్టోబర్ 17 (జనంసాక్షి)**

కామారెడ్డి జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మె శిబిరం 5 వ రోజు శిబిరాన్ని గౌరవ కామారెడ్డి శాసన సభ్యులు శ్రీ కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మద్దతు తెలిపారు. ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు పూర్తి మద్దతు తెలిపిన కామారెడ్డి శాసనసభ్యులు నాలుగు నెలల చంటిపాపను పట్టుకుని ఎండలో కూర్చున్న మహిళా ఉద్యోగి దుస్థితినీ చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలనలో గడీల పాలన, నిరంకుశ ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. శాంతియుతంగా తమ డిమాండ్ల కోసం దీక్ష చేసుకుంటామంటే కనీసం నీడ కోసం టెంట్ వేసుకునేందుకు కూడా అనుమతి ఇవ్వకుండా ఉద్యోగులను, వారి చంటిపిల్లలను రోడ్డుపై మండుటెండలోనే కూర్చోబెట్టడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ కుసంస్కారానికి నిదర్శనం అని, ప్రజలకు ఆరోగ్య సేవలు అందించే ఉద్యోగులపై ఈ ప్రభుత్వం ఇలాంటి కక్షసాధింపు చర్యలకు పాల్పడటం గర్హనీయం అని అన్నారు.ఇంతటి క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం, 'సమాన పనికి సమాన వేతనం' సూత్రాన్ని అమలు చేయకపోవడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చేపడుతున్న న్యాయమైన పోరాటానికి తన పూర్తి మద్దతు ఉంటుందని, వారి సమస్యలు తీరేవరకు అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు.



# ప్రచారంలో ఘనం.. ప్రగతిలో శూన్యం..

## - కోనరావుపేట అభివృద్ధి మాటలకే పరిమితం - పాలకుల నిర్లక్ష్యంపై బీజేపీ ధ్వజం



**కోనరావుపేట(జనంసాక్షి):** పాలకులు మారినా కోనరావుపేట తలరాత మారడం లేదని, ఏళ్ల గడుస్తున్నా ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదని బీజేపీ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం కోనరావుపేట మండల కేంద్రంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు గొట్టె రామచంద్రం, మండల ప్రధాన కార్యదర్శి బైరగోని సురేష్ గౌడ్, సీనియర్ నాయకులు దుర్గం తిరుపతి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కోనరావుపేట మండల కేంద్రంలో ప్రజా ప్రయోజనార్థం ప్రారంభించిన ఆడిటోరియం నిర్మాణం ఏళ్ల తరబడి అసంపూర్తిగానే మిగిలిపోవడం ప్రజాప్రతినిధులు, అధికారుల తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొదలైన పనులు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇంతకాలం గడుస్తున్నా ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం పాలకుల అసమర్థతను కళ్లకు కడుతోందని విమర్శించారు. లక్షల రూపాయల ప్రజాధనాన్ని శిలాఫలకాలకే పరిమితం చేస్తూ నిరుపయోగంగా మార్చడం సిగ్గుచేటన్నారు. ఆడిటోరియం భవన నిర్మాణమే కాకుండా, దాని ఎదుట కనీసం మురుగు కాల్వ పనులు కూడా పూర్తి చేయకపోవడంతో పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయని, లోపలికి వెళ్లడానికి సరైన దారి కూడా లేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కోనరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి కనీసం ప్రహరీ గోడ కూడా నిర్మించకపోవడం చూస్తుంటే, ప్రజారోగ్యంపై ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంతటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. మండల కేంద్రానికే ఈ దుస్థితి పడితే, ఇక మారుమూల గ్రామాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. శాంతిభద్రతలను కాపాడే పోలీస్ స్టేషన్ ముందున్న కల్వర్టు సమీపంలో కనీసం సీసీ రోడ్డు వేయలేని దుస్థితిలో యంత్రాంగం ఉందంటే, ఈ ప్రభుత్వానికి ప్రజా సమస్యలపై ఎంతటి చిత్తశుద్ధి ఉందో స్పష్టమవుతోందన్నారు. రోడ్లపై పెద్దపెద్ద గుంతలు పడి నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నా అధికార యంత్రాంగంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. ?ప్రస్తుత పాలన "ప్రచారంలో ఘనం.. ప్రగతిలో శూన్యం" అన్న చందంగా మారిందని, గొప్పలు చెప్పుకోవడానికే తప్ప క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి రూపాయి విదిల్చడం లేదని ఆరోపించారు. ప్రజల ఓట్లతో గద్దెనెక్కి ప్రాథమిక సమస్యలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ పాలకుల వైఖరిని ప్రజాక్షేత్రంలో బీజేపీ ఎండగడుతుందని హెచ్చరించారు. పాలకులు, అధికారులు ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి, తక్షణమే అసంపూర్తిగా ఉన్న ఆడిటోరియం, ఆసుపత్రి ప్రహరీ గోడ, డ్రైనేజీ పనులతో పాటు రోడ్ల నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.



## ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి సంఘీభావం

**పెద్దపల్లి,అక్టోబర్ 17(జనంసాక్షి) :** జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్ హెచ్ ఎం ) ఉద్యోగులు తమ న్యాయమైన హక్కులు, సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరసన కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సేవలను ఆమె గుర్తుచేస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వారి పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న ఉద్యోగుల సమస్యలను సంబంధిత అధికారులు, ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని, వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, వారి హక్కులకు భంగం కలగకుండా చూడాలని డాక్టర్ దాసరి మమతా రెడ్డి సూచించారు.ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు తమ సంఘీభావం ఎల్లప్పుడూ ఉంటుందని ఆమె తెలిపారు.వారి వెంట పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్, టిఆర్ఎస్వి కో ఆర్డినేటర్ కొయ్యడ సతీష్ గౌడ్, పూదరి చంద్రశేఖర్,బాలసాని శ్రీనివాస్,అడ్వకేట్ శ్యాంబాబు,గడ్డం శ్యామ్,శ్రీనివాస్ జక్కుల శ్రీకాంత్ ఉన్నారు.

## రైతులకు విద్యుత్, సాగునీటి సమస్యలను పరిష్కరించాలి

**- బీజేపీ పార్టీ నేతల డిమాండ్**

**- రాఘవపూర్ సబ్‌స్టేషన్ ఎదుట బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా**



**పెద్దపల్లి,అక్టోబర్ 17(జనంసాక్షి) :** రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడంతోపాటు, ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగునీటిని సకాలంలో విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ నాయకులు, రైతులు పెద్దపల్లి మండలం రాఘవపూర్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు.బీజేపీ రాష్ట్ర శాఖ,కిసాన్ మోర్చా రాష్ట్ర శాఖ, పెద్దపల్లి జిల్లా శాఖ పిలుపు మేరకు శనివారం నిర్వహించిన ధర్నాలో వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు. రైతుల విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, తరచూ విద్యుత్ కోతలు విధించడంతో వ్యవసాయ మోటార్ల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, విద్యుత్ సరఫరా ఎప్పుడు నిలిచిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతల కారణంగా పంటలకు తగిన సమయంలో నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు.అలాగే ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగునీటిని ముందుగానే విడుదల చేసి ఉంటే రైతులకు ప్రయోజనం కలిగేదని, నీటిని సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల పంటలు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.బీజేపీ కిసాన్ మోర్చా పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కట్టూరి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని, విద్యుత్ కోతల వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్, సాగునీరు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ రాష్ట్ర నాయకులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో తూకం పేరుతో రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో రైస్ మిల్లులపై అధికారులు తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా, సాగునీరు, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, నిరంతర విద్యుత్ సరఫరా,సకాలంలో సాగునీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి శివంగారి సతీష్,యువ మోర్చా అధ్యక్షులు రామగిరి అఖిల్,కందుల శ్రీనివాస్,కల్లేపల్లి అంజి,వేణు,కుమార్,అన్వేష్,తదితరులు పాల్గొన్నారు.

## దావన్నపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

**- ఏఐఎఫ్‌బీ జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్**

**- ఏఐఎఫ్‌బీ పార్టీలో చేరిన వార్డు సభ్యులు**



**పెద్దపల్లి,అక్టోబర్ 17(జనంసాక్షి) :** దావన్నపల్లి గ్రామం ఐకమత్యానికి నిలువెత్తు ప్రతీక అని,రానున్నది బీసీల రాజ్యమేనని,ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ ప్రశ్నించే గొంతుకగా ఎల్లప్పుడూ మీ ముందుండి నిలబడతానని ఏఐఎఫ్‌బీ జిల్లా కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్ ఉద్ఘాటించారు.తనపై అపారమైన నమ్మకంతో ఇంతటి ప్రేమాభిమానాలను కురిపిస్తున్న దావన్నపల్లి గ్రామాన్ని జిల్లాలోనే అన్ని రంగాల్లో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని,అభివృద్ధి దిశగా తనతో కలిసి నడవాలని ఆయన గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు.శనివారం గ్రామానికి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు,కీలక నాయకులు,గ్రామస్తులు ముక్తకంఠంతో కొలిపాక శ్రీనివాస్ నాయకత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.రానున్న 2028 శాసనసభ ఎన్నికల్లో కొలిపాక శ్రీనన్నను ఎమ్మెల్యేగా గెలిపించుకోవడమే లక్ష్యంగా,గ్రామం మొత్తం ఆయన వెంటే నిలుస్తుందని స్పష్టం చేస్తూ భారీ ఎత్తున ఏఐఎఫ్‌బీ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక వార్డు సభ్యులు ఆసంపల్లి రామ్మోహన్,లక్ష్మి-రమేష్,దొడ్ల రిషిత-సతీష్,సర్పంచ్ అభ్యర్థి దొడ్ల రామకృష్ణ, దావన్నపల్లి ఆలయ చైర్మన్ మద్దెల మల్లయ్యలతో పాటు గ్రామ పెద్ద మనుషులు, యువకులు,మహిళలు కొలిపాక శ్రీనివాస్ సమక్షంలో పార్టీలో చేరారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, ప్రజా సంక్షేమానికి శ్రీనివాస్ నాయకత్వమే సరైన మార్గమని ఈ సందర్భంగా చేరిన నాయకులు స్పష్టం చేశారు.

## పెద్దపల్లిలో దసరా రోజున రావణ దహన కార్యక్రమం

**బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే సిహెచ్ విజయ రమణారావు**



**పెద్దపల్లి,అక్టోబర్ 17(జనంసాక్షి) :** దసరా ఉత్సవాలను పురస్కరించుకొని పెద్దపల్లి మున్సిపల్ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే రామ్‌లీలా (రావణ దహనం) ఏర్పాట్లను మరియు పెద్దపల్లి పట్టణంలోని ఎల్లమ్మ గుండమ్మ చెరువు కట్ట వద్ద బతుకమ్మ ఏర్పాట్లను స్థానిక ప్రజాప్రతినిధులతో, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించి దసరా రోజున జరిగే రావణ దహన కార్యక్రమానికి ప్రజలందరూ హాజరు కావాలని కోరిన ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.అనంతరం పెద్దపల్లి పట్టణ శివారులో (నిమ్మనపల్లి - నిట్టూరు రోడ్డు) పెద్దపల్లి రైతులకు మరియు ఎల్లమ్మ గుండమ్మ చెరువు లోకి వెళ్ళే కాలువ తూమును స్థానిక నాయకులతో కలిసి ప్రభుత్వ విప్ విజయరమణ రావు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, కమిషనర్ ఆకుల వెంకటేష్, పిఏసిఎస్ చైర్మన్ ముత్యాల నరేష్ ,కౌన్సిలర్లు భూతగడ్డ సంపత్,అఙ్రబ్ షరీఫ్, అమ్రేష్,పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు మరియు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**కరీంనగర్ టౌన్ , అక్టోబర్ 17, ( జనం సాక్షి)**
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) కరీంనగర్ రీజియన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ బస్‌స్టేషన్ ఆవరణలో బతుకమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్ మహిళా ఉద్యోగులకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను అందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యదర్శి వి. శ్రవణ్ కుమార్, కరీంనగర్-1 డిపో మేనేజర్ ఐ. విజయమాధురి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయ సూపర్‌వైజర్ సత్యం, బస్‌స్టేషన్ సూపర్‌వైజర్ రామకృష్ణ, బస్‌స్టేషన్ కంట్రోలర్లు ఏ.వి.ఆర్. రెడ్డి, కొమురయ్యతో పాటు కరీంనగర్-1, కరీంనగర్-2 డిపోలకు చెందిన మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడిగా మానువాడ శంకర్

**వేములవాడ, అక్టోబర్ 17 (జనంసాక్షి):**



పి ఆర్ టి యు టి ఎస్ 6వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడిగా మానువాడ శంకర్ నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు సుంకరి బిక్షం గౌడ్, ప్రధాన కార్యదర్శి భట్టాపురం మధుసూదన్ రెడ్డి ప్రకటన చేశారు. శంకర్ ప్రస్తుతం అనుపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ (సోషల్)గా పనిచేస్తున్నారు. గత 32 ఏళ్లుగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి, ఉద్యమాలకు విశేష కృషి చేసినందుకు గాను ఈ పదవి దక్కింది. తన ఎంపికకు సహకరించిన జిల్లా, మండల నాయకులకు శంకర్ ధన్యవాదాలు తెలిపారు. ఆయన నియామకం పట్ల జిల్లా నాయకులు, అనుపురం పాఠశాల ఉపాధ్యాయులు కవిత, రమేష్, దేవేందర్, రవీందర్, రమేష్, రజిత తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# సద్దుల బతుకమ్మకు సర్వ సిద్ధం

### - మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ

**సుల్తానాబాద్,అక్టోబర్ 17(జనంసాక్షి) :**
సద్దుల బతుకమ్మకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ మున్సిపల్ కమిషనర్ టి రమేష్ తెలిపారు. శనివారం సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని స్థానిక ఊర పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. లైటింగ్ తో పాటు, బతుకమ్మ ఘాట్, కట్టను చదును చేసి మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు వారు తెలిపారు. భారీకెడ్లు మంచినీటి సదుపాయం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మున్సిపల్ సిబ్బంది,తదితరులు ఉన్నారు.



# చెరువులో పడి వ్యక్తి మృతి

**గంభీరావుపేట, అక్టోబర్ 17 (జనంసాక్షి):**



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట గ్రామానికి చెందిన సాహెబ్ గారి నరేందర్ (31) ఆల్మోగుల చెరువులో పడి మృతి చెందాడు. శనివారం సాయంత్రం చెరువులో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గత కొంతకాలంగా మద్యపానానికి బానిసై మనోవేదనకు గురవుతున్న నరేందర్ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెంది ఉండవచ్చని అతడి తల్లి పుష్పల పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కుమారుడి మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపడుతున్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శ

**రామగిరి, అక్టోబర్ 17, (జనంసాక్షి) :**



పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం నాగేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తాటి శ్రీనివాస్ గౌడ్ ప్రమాదవశాత్తు రోడ్డు యాక్సిడెంట్ మరణించగా వారి కుటుంబ సభ్యులను బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం సాయంత్రం పరామర్శించారు. ఇందులో భాగంగా శ్రీనివాస్ గౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మంత్రి వెంట ఉమ్మడి కమాన్ పూర్ మండల మాజీ ఎంపీపీ కోలేటి మారుతి, తదితరులు ఉన్నారు.

# బతుకమ్మ పండుగ వేళ.. బతుకమ్మ చీరలేవి?

### ఆడపడుచులకు నిరాశ మిగిల్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

### హామీలు ఎటువైపు? ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బండ రమేష్

**గంభీరావుపేట, అక్టోబర్ 17 (జనంసాక్షి):**



బతుకమ్మ పండుగ వేళ ఆడపడుచులకు అందించాల్సిన బతుకమ్మ చీరలు ఎక్కడంటూ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, అంబేద్కర్ సంఘాల జిల్లా ఉపాధ్యక్షుడు బండ రమేష్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ముస్తఫానగర్ గ్రామానికి చెందిన ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రేపే సద్దుల బతుకమ్మ పండుగ జరగనున్న నేపథ్యంలో మహిళలకు పండుగ కానుకగా అందించాల్సిన బతుకమ్మ చీరల పంపిణీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పండుగ వేళ ఆడపడుచులకు నిరాశ మిగలడం బాధాకరమని అన్నారు. మహిళల సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను నిరాశకు గురిచేయడం సరికాదన్నారు. అమలు చేయగలిగే హామీలనే ఇవ్వాలని, ఇచ్చిన హామీలను సకాలంలో నెరవేర్చాలని బండ రమేష్ డిమాండ్ చేశారు.

## పిఆర్టియుటిఎస్ 6 రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో అసోసియేట్ ప్రెసిడెంట్లుగా ఎన్నికైన గర్గుల కృష్ణహరి, గోసిక మధు

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 17, (జనంసాక్షి) :**



నల్గొండ జిల్లా కేంద్రంలో శుక్రవారం పిఆర్టియుటిఎస్ 6వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా భిక్షంగౌడ్, మధుసూదన్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. ఎల్లారెడ్డిపేట మండల శాఖ నుండి రాష్ట్ర కార్యవర్గానికి అసోసియేట్ ప్రెసిడెంట్లుగా గర్గుల కృష్ణ హరి, గోసిక మధు, ఉపాధ్యక్షులుగా చేరాల ప్రభాకర్, ఎండి షఫీ, కార్యదర్శిగా గోలి ఆనంద్‌లు ఎన్నికయ్యాయాన్నారు. ఈ సందర్భంగా టీచర్ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ 72457 సభ్యత్వాలతో పిఆర్టియుటిఎస్ అతి పెద్ద ఉపాధ్యాయ సంఘంగా నిలిచిందని రాష్ట్ర నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండల శాఖ నుండి నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులను, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి. శ్రీనివాసరావు, ఇ. కిషన్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తెల్ల పూర్ణచందర్, బొల్లి భగవాన్‌లు అభినందనలు తెలియజేశారన్నారు.



# మిడ్ మానేరు నీటిలో గుర్తుతెలియని మృతదేహం

**బోయినపల్లి అక్టోబర్ 17 (జనం సాక్షి)**
రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొదురుపాక శివారులోని మిడ్ మానేరు జలాశయ నీటిలో గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతదేహం రెండు, మూడు రోజుల క్రితం నీటిలో పడి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడి వయసు సుమారు 50 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందని అంచనా వేస్తున్నారు. మృతుడు నలుపు రంగు షాట్, నీలం రంగు చొక్కా ధరించి ఉన్నాడు. చొక్కా కాలర్‌పై రాయల్ టైలర్, ఆర్.కె. నగర్, మల్కాజిగిరి, హైదరాబాద్ -47' అని ముద్రించి ఉంది. మృతదేహాన్ని వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామనీ. మృతుడి ఆచూకీ తెలిసిన వారు,బంధువులు ఎవరైనా ఉంటే బోయినపల్లి పోలీసులను 87126 56418 ,87126 56416 సంప్రదించాలని పోలీసులు కోరారు.

# ఎస్ఐ శ్రీకాంత్ సస్పెన్షన్

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, అక్టోబర్ 17 (జనంసాక్షి);**



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసిన శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ, జోన్-3 రాజన్న ఇన్‌చార్జి డీఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి ఐపీఎస్ శనివారం రోజున ఉత్తర్వులు జారీ చేశారు. విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిం చడం, థర్డ్ డిగ్రీ చేసారంటూ వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఎస్ఐ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సస్పెన్షన్ కాలంలో ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను విడిచి వెళ్లకూడదని ఆదేశించారు.

# సబ్‌స్టేషన్‌లో సింక్రోనైజేషన్ ప్రక్రియను ప్రారంభించిన విద్యుత్‌శాఖ ఎస్ఈ



**రామడుగు(జనంసాక్షి):**
మోతె గ్రామంలో ఉమ్మెత్తల సత్యనారాయణకు చెందిన 6 మెగా వాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్ యొక్క ఉత్పత్తిని వినియోగించుకోవడానికి టీజీఎన్పీడీసీఎల్‌కు చెందిన కొత్తపెల్లి సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సంస్థ నుండి కరీంనగర్ సూపరిండెంట్ ఇంజనీర్ విజేందర్ రెడ్డి సింక్రోనైజేషన్ చేశారు. ఈ ప్లాంట్ యొక్క ఉత్పత్తి శనివారం నుంచి టీజీఎన్పీడీసీఎల్‌కు సరఫరా చేయబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి డివిజన్ ఇంజనీర్ రూరల్ కరీంనగర్ తిరుపతి, డివిజన్ ఇంజనీర్ ఎంఆర్‌టి చంద్రమౌళి, ఎస్టి మీటర్ ఏడీఈ రవి, కొత్తపల్లి ఏఈ ఆ .శ్రీనివాస్, గుండి ఏఈ కొమ్ము కమలేశ్వర్ వారి సిబ్బంది హాజరు కావడం జరిగింది.

# చీరలు పంపిణీ చేసిన వార్డు సభ్యుడు

**కోనరావుపేట(జనంసాక్షి):**



కోనరావుపేట మండలం లోని మల్కపేట గ్రామంలో వార్డ్ మెంబర్ ఆరే పరుశరాములు బతుకమ్మ పండుగ సందర్భంగా తన వార్డులోని 68 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆరే లత తదితరులు పాల్గొన్నారు.

# 8ఏ గని ప్రమాద మృతులకు ఘన నివాళులు

## 23వ వర్ధంతి సందర్భంగా కార్మికులు, అధికారులు, యూనియన్ నాయకుల నివాళులు



**గోదావరిఖని (జనంసాక్షి)అక్టోబర్ 17:** 8ఏ గని ప్రమాదంలో మృతి చెందిన పది మంది సింగరేణి కార్మికుల 23వ వర్ధంతి సందర్భంగా శనివారం ఓసీపీ-3 కృషి భవన్ సమీపంలోని మృతుల స్తూపం వద్ద సింగరేణి యూనియన్ నాయకులు, అధికారులు, కార్మికులు ఘనంగా నివాళులర్పించారు. మృతుల స్తూపం వద్ద పూలమాలలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి కార్మికుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సింగరేణి యూనియన్ నాయకులు, ప్రాజెక్టు అధికారులు మాట్లాడుతూ.. గని ప్రమాదంలో పది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం మృతుల కుటుంబాలకు తీరని లోటును మిగిల్చిందని, వారి నష్టాన్ని ఎప్పటికీ పూడ్చలేమని పేర్కొన్నారు. అప్పట్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, తగిన రక్షణ సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో ఘోర ప్రమాదం జరిగి పది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాల్లో కొంతమందికి నేటికీ న్యాయం జరగకపోవడం బాధాకరమని అసంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో సింగరేణిలో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, కార్మికులకు అవసరమైన రక్షణ సదుపాయాలు కల్పించాలని సూచించారు. కార్మికులు సైతం విధి నిర్వహణలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ, ప్రమాద సూచనలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సాంబశివరావు, రాజరత్నం, ఐఎన్‌టీయూసీ నాయకులు కొత్త సత్యనారాయణరెడ్డి, శంకర్ నాయక్, మార్కండేయ, టీబీజీకేఎస్ నాయకులు మిరియాల రాజిరెడ్డి, ఐలి శ్రీనివాస్, హెచ్ఎంఎస్ నాయకులు దావు రమేష్, సీఐటీయూ నాయకులు ప్రవీణ్ కుమార్, ఉల్లి మొగిలి, అధికారుల సంఘం నాయకులు నరసింహారావు, ప్రాజెక్టు అధికారి ఉదయ్ హరిజన్‌తో పాటు పలువురు కార్మికులు, అధికారులు పాల్గొని మృతులకు ఘన నివాళులర్పించారు.



### సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో

## ఘనంగా బతుకమ్మ సంబరాలు

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 17, ( జనం సాక్షి) సఖి వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి శ్రీమతి సరస్వతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ బెజ్జంకి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని నిర్వహించిన ఈ వేడుకల్లో సఖి సిబ్బంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సఖి నిర్వాహకురాలు దామెర లక్ష్మి, లీగల్ కౌన్సిలర్ సంధ్యారాణి, సోషల్ కౌన్సిలర్ రేణుక, కేస్ వర్కర్లు రజిత, పద్మ, పారామెడికల్ సిబ్బంది సంగీత, రాణి, ఐటీ అసిస్టెంట్ రాణి, మల్టీపర్పస్ వర్కర్లు విజయలక్ష్మి, అనిత, సెక్యూరిటీ సిబ్బంది నాగమణి, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

## రేకొండలో బతుకమ్మ పండుగ ఏర్పాట్లను పరిశీలించిన ఎంపిడిఓ రామ్మోహన్ చారి..

### బతుకమ్మ,దసరా పండుగలో ఇబ్బందులు లేకుండా చూడాలని సూచన..

**చిగురుమామిడి అక్టోబర్ 17(జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ,దసరా పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో,సంతోషంగా జరుపుకునేలా రేకొండ గ్రామంలోని బతుకమ్మ ఘాట్ వద్ద ముందస్తు ఏర్పాట్లను అధికారులు,ప్రజాప్రతినిధులు శనివారం ఉమ్మడిగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో చిగురుమామిడి ఎంపిడిఓ రామ్మోహన్ చారి,ఎంపీఓ కిరణ్ కుమార్,రేకొండ గ్రామ సర్పంచ్ అల్లెపు సంపత్,ఉపసర్పంచ్ బిల్లా సంతోష్ రెడ్డి,గ్రామపంచాయతీ కార్యదర్శి గోదారి అజయ్ కుమార్ పాల్గొని పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు బతుకమ్మలు ఆడుకునే స్థలంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లైటింగ్,తాగునీరు,పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.చెరువులు,ఘాట్ల వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలని,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గ్రామంలోని ప్రజలందరూ ఈ పండుగను ప్రశాంత వాతావరణంలో వైభవంగా జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.



# మరణానంతరం ఇద్దరికీ వెలుగులు

- విద్యాబోధనతో ఎందరికో మార్గదర్శి..
- పర్యావరణ పరిరక్షణలోనూ ముందడుగు..
- చివరి కోరిక మేరకు దామోదర్‌రెడ్డి నేత్రదానం..



గోదావరిఖని, జనంసాక్షి : తాను కన్నుమూసినా.. మరో ఇద్దరు ప్రపంచాన్ని చూసేలా చేయాలన్న ఆయన ఆశయం నెరవేరింది. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారి భవిష్యత్తుకు బాటలు వేసిన ఉపాధ్యాయుడు.. పచ్చదనం పెంపొందించేందుకు తన వంతు కృషి చేసిన పర్యావరణ ప్రేమికుడు.. మరణానంతరం కూడా తన సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. గోదావరిఖని దుర్గానగర్‌కు చెందిన గీట్ల దామోదర్‌రెడ్డి (79) తన చివరి కోరిక మేరకు నేత్రదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

**విద్యారంగానికి విశేష సేవలు..**

దామోదర్‌రెడ్డి గోదావరిఖనిలోని సెక్టార్-1 సింగరేణి ఉన్నత పాఠశాలలో సుమారు 30 ఏళ్లపాటు ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా పనిచేశారు. ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారి అభ్యున్నతికి తోడ్పడ్డారు. పర్యావరణ పరిరక్షణపై ఆసక్తితో మొక్కలు నాటడం, పచ్చదనాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఏర్పాటైన జీపీపీజీ స్వచ్ఛంద సంస్థకు సుమారు పదేళ్లపాటు అధ్యక్షుడిగా సేవలందించారు. విద్య, పర్యావరణ రంగాల్లో తనదైన ముద్ర వేశారు.

**విషాదంలోనూ గొప్ప నిర్ణయం..**

అనారోగ్యంతో శుక్రవారం రాత్రి దామోదర్‌రెడ్డి తుదిశ్వాస విడిచారు. ఆయన నేత్రదానం చేయాలన్న చివరి కోరికను తెలుసుకున్న కుటుంబ సభ్యులు దాన్ని నెరవేర్చేందుకు ముందుకొచ్చారు. భార్య సుగుణ, కుమార్తె, అల్లుడు అవంతి?మురిరెడ్డి చెన్నారెడ్డి, కుమారుడు, కోడలు డాక్టర్ సందీప్‌రెడ్డి? డాక్టర్ సుప్రజారెడ్డి నేత్రదానానికి అంగీకరించారు. ప్రియమైన వ్యక్తిని కోల్పోయిన బాధలోనూ ఆయన ఆశయానికి ప్రాధాన్యమిచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. శనివారం దుర్గానగర్‌లోని దామోదర్‌రెడ్డి నివాసంలో సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, ప్రచార కార్యదర్శి కే.ఎస్. వాసు, జిల్లా అధ్యక్షుడు అరెపెల్లి రాజమౌళి ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించారు. ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకు సాంకేతిక నిపుణుడు ప్రదీప్ నాయక్, సహాయకుడు ఆరిఫ్ నేత్రాల సేకరణలో పాల్గొన్నారు. అనంతరం వాటిని ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకుకు తరలించారు.

**సేవలకు నివాళి..**

దుర్గానగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు మంథని సంపత్, బాలసాని స్వామిగౌడ్, బుచ్చిరెడ్డి, డాక్టర్ నాగిరెడ్డితోపాటు పలువురు ప్రముఖులు, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు దామోదర్‌రెడ్డికి నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఒక ఉపాధ్యాయుడిగా విద్యార్థుల జీవితాలకు దిశానిర్దేశం చేసిన ఆయన.. నేత్రదానం ద్వారా మరో ఇద్దరికి కొత్త ప్రపంచాన్ని చూపించనున్నారు. మనిషి జీవితం ముగిసినా, ఆయన చేసిన సేవలు మరికొందరి జీవితాల్లో కొనసాగుతాయనడానికి దామోదర్‌రెడ్డి నేత్రదానం నిదర్శనం. ఆయన ఆశయాన్ని గౌరవించిన కుటుంబ సభ్యుల నిర్ణయం మరెందరికో స్ఫూర్తిగా నిలవనుంది.

### చిగురుమామిడి మండల పరిషత్ కార్యాలయంలో

# రిటైర్డ్ ఎంపీడీవో అయిత కైలాసం గారికి ఘన నివాళులు..



**చిగురుమామిడి అక్టోబర్ 17(జనం సాక్షి):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల పరిషత్ కార్యాలయంలో,పూర్వపు సూపరిండెంట్ మరియు ఇంచార్జ్ ఎంపీడీవోగా పనిచేసి పదవీ విరమణ పొంది,ఇటీవల స్వర్గస్తులైన కీ.శే. శ్రీ అయిత కైలాసం గారికి ఘన నివాళులు అర్పించారు.కార్యాలయ సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా వారు మండల ప్రజలకు అందించిన విశేష సేవలను కొనియాడారు.ఎంపీడీవో రామ్మోహన చారి మాట్లాడుతూ... వృత్తిపట్ల ఎంతో నిబద్ధత, అంకితభావం కలిగిన ఒక ఉత్తమ అధికారిని కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సంతాప కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన చారి,ఎంపీఓ కిరణ్ కుమార్,ఏపీవో రాజు,చిగురు మామిడి జిపి కార్యదర్శి రమేష్ వీరితో పాటు మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు,కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు,ఆఫీస్ సబార్డినేట్లు పాల్గొని కైలాసం గారికి నివాళులు సమర్పించారు.

### నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని

## దర్శించుకున్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**యైటింక్లైన్ కాలనీ (జనంసాక్షి),అక్టోబర్ 17:** రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ కాలనీ లోని పలు దుర్గాదేవి మండపాలను సందర్శించి అమ్మవారిని దర్శించు కున్నారు. 8 ఇంక్లైన్ కాలనీ, ఓసీపీ-3, ఏరియా వర్క్‌షాప్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాలను సందర్శించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులను, ఉత్సవ నిర్వాహకులను అభినందించారు.ఈ సందర్భంగా ఆయా ఉత్సవ కమిటీల సభ్యులు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమాల్లో మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేషన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కథలాపూర్ పోలీస్ స్టేషన్ సందర్శించిన నూతన సి ఐ.కొమ్ము తిరుపతి

**కథలాపూర్ అక్టోబర్ 17 (జనంసాక్షి)**

కథలాపూర్ మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ను నూతన బాధ్యతలు స్వీకరించిన కోరుట్ల సీఐ కొమ్ము తిరుపతి శనివారం రోజు సందర్శించడం జరిగింది. మండలంలోని అన్ని గ్రామాలలో శాంతియుతంగా దసరా ఉత్సవాలు జరుపుకోవాలని పలు విషయాలపై ఎస్సై రవి కిరణ్ తో మాట్లాడడం జరిగింది. ఎస్సై రవి కిరణ్ తో మరియు కానిస్టేబుల్ ముత్తయ్య,శ్రీకాంత్ పాలుగోన్నారు.

### పి ఎం జె జె బి వై పి ఎం ఎస్ బి వై బీమా పథకాలు

## ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

### కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ ముద్దం శ్రీనివాస్ రెడ్డి



**ముస్తాబాద్ అక్టోబర్ 17 (జనంసాక్షి)**

ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకాన్ని ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని బీమాతో కుటుంబం ధీమాగా ఉంటుందని కేడీసీసీ బ్యాంక్ ముస్తాబాద్ బ్రాంచ్ మేనేజర్ ముధం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు బ్రాంచ్ పరిధిలో ఇటీవల ఐదుగురు ఖాతాదారులు మృతి చెందగా వారికి బీమా ద్వారా మంజూరైన రెండు లక్షల చెక్కులను శనివారం అందించారు ఈ సందర్భంగా ఆయన బీమా వల్ల కలుగు లాభాలను వివరించారు గన్నే రేణుక గాడి చిల్లర దేవయ్య చింతకింది భాగ్యమ్మ ఆంధ్ర కనకయ్య పిల్లి బాలయ్య బాబయ్య హాలో ప్రమాదవశాత్తు మృతి చెందగా వారికి మంజూరైన బీమా చెక్కులను వారి నామినీయులైన బంధువులకు అందజేశారు ఈ సందర్భంగా ఆయన భీమా వల్ల కలుగు లాభాలను వివరిస్తూ ప్రతి ఖాతాదారుడు బీమా కలిగి ఉండాలని సూచించారు ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి ఫీల్డ్ ఆఫీసర్ గంగాధర్ రెడ్డి అసిస్టెంట్ మేనేజర్ రవితేజ స్రవంతి సిబ్బంది వహీద్ శ్రావణ్ పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి సలహా కమిటీ సభ్యుడిగా కాచే

**మంథని, అక్టోబర్ 17, (జనంసాక్షి):**



తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి సలహా కమిటీ సభ్యుడిగా మంత్రి శ్రీధర్ బాబు అనుచరుడు, మంథనికి చెందిన న్యాయవాది, సామాజిక కార్యకర్త శశిభూషణ్ కాచె నియమితులయ్యారు. ఈ మేరకు కమిషన్ కార్యదర్శి వి. రాంచందర్ ఈ నెల 16న ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ సభ్యుడిగా ఆయన మూడేళ్ల పాటు బాధ్యతలు నిర్వహించనున్నారు. విద్యుత్ రంగానికి సంబంధించిన వివిధ అంశాలపై సలహాలు, సూచనలు అందించే కీలక కమిటీలో శశిభూషణ్ కాచెకు మరోసారి అవకాశం లభించింది. ఆయన ఈ కమిటీలో సభ్యుడిగా నియమితులు కావడం ఇది మూడోసారి. న్యాయవాదిగా, సామాజిక కార్యకర్తగా మంథని ప్రాంతంలో ఆయనకు ఉన్న అనుభవం కమిటీ బాధ్యతల నిర్వహణలో ఉపయోగపడనుంది. తన నియామకానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబులకు శశిభూషణ్ కాచె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఆఫీస్ సబార్డినేట్‌కు టైపిస్ట్‌గా పదోన్నతి

**శంకరపట్నం అక్టోబర్ 17 జనంసాక్షి**



కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల పరిషత్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ నయీమ్ టైపిస్ట్‌గా పదోన్నతి పొందారు. సైదాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో టైపిస్టుగా బాధ్యతలు చేపట్టేందుకు ఆయనకు పదోన్నతి కల్పించారు. ఈ సందర్భంగా శంకరపట్నం ఎంపీడీవో అనిత అబ్దుల్ నయీమ్‌ను అభినందించి, నూతన బాధ్యతల్లో మరింత సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఉద్యోగ జీవితంలో పదోన్నతులు బాధ్యతలను మరింత పెంచుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పర్యవేక్షకులు రాఘవేందర్ రెడ్డి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొని అబ్దుల్ నయీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## పోలీసుల అదుపులో పేకాట రాయుళ్లు..

**గోదావరిఖని, జనంసాక్షి :**



రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ జూద కార్యకలాపాలపై పోలీసులు నిరంతరం చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శనివారం తెల్లవారుజామున నార్కోటిక్/టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వంలో ఎస్ఐ దీకొండ రమేష్, సిబ్బంది నమ్మదగిన సమాచారం మేరకు గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సప్తగిరి కాలనీలో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 4,850 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

**అదుపులోకి తీసుకున్న వారి వివరాలు..**

గోదావరిఖని లక్ష్మీ నగర్ కు చెందిన మహమ్మద్ తాజుద్దీన్, గోదావరిఖని సప్తగిరి కాలనీకి చెందిన బండారి సందీప్ సుధాకర్,లింగంపల్లి శివ,నెరెల్ల రాజు, కీర్తి హరీష్ ను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ అధికారులకు అప్పగించారు.

## సద్దుల బతుకమ్మ కోసం ప్రత్యేక ఏర్పాట్లు

**ఇల్లంతకుంట, అక్టోబర్ 17 (జనంసాక్షి):**



మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ వేడుకల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు, ఇల్లంతకుంట సర్పంచ్ మామిడి రాజు తెలిపారు. బతుకమ్మ తెప్ప వద్ద విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయడంతో పాటు మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిసర ప్రాంతాలను చదును చేసి రంగులు వేయించినట్లు పేర్కొన్నారు. చింతలకుంటపల్లె మార్గంలోని ఎర్రకుంట వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామని, ప్రధాన రహదారుల వెంట ఎల్‌ఈడీ, సిరీస్ లైట్లు అమర్చినట్లు తెలిపారు. మహిళలు సౌకర్యవంతంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేలా అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మూగు నాగరాజు శర్మ, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది మామిడి నర్సయ్య, ఎలుక రాము తదితరులు పాల్గొన్నారు.

## న్యూజెర్సీలో.. బతుకమ్మ సంబరాలు

**కమాన్ పూర్, అక్టోబర్ 17, (జనంసాక్షి) :**

తెలంగాణ సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబురాలు అమెరికాలోని న్యూజెర్సీలో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ బతుకమ్మ పండుగ సంబరాల సందర్భంగా పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన సముద్రాల వేణుగోపాల చార్యులు అక్కడ పండుగ నేపథ్యం.. గురించి ప్రకృతిని ప్రేమించే పండుగగా అభివర్ణిస్తూ.. పూల జాతర బతుకమ్మ వైబావాన్ని వివరించారు. తెలంగాణ తెలుగింటి ఆడపడుచులు ఎల్లలు దాటిన మన సంస్కృతి సంప్రదాలను పాటిస్తూ ఆదర్శంగా నిలిస్తున్నారు.





## సద్దుల బతుకమ్మ పండుగను విజయవంతం చేయండి

**చొప్పదండి ,అక్టోబర్ 17 (జనంసాక్షి):**

చొప్పదండి పట్టణంలో ఆదివారం నిర్వహించే సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు పూర్తి పూర్తి చేసామని సద్దుల బతుకమ్మ పండుగను పట్టణ ఆడపడుచులు ఘనంగా జరుపుకొని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో సద్దుల బతుకమ్మ ఏర్పాటుపై అధికారులతో కౌన్సిలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ శాంతియుత వాతావారణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బతుకమ్మల నిమజ్జనం పూర్తి చేయవలెనని సూచించినారు. కార్యక్రమములో మున్సిపల్ కమిషనర్ నాగరాజు , కౌన్సిల్ సభ్యులు గుర్రం రాజేందర్రెడ్డి, పిట్టల వెంకటేష్, సానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీ పి. మహేష్, పోలీస్ శాఖ, విద్యుత్ శాఖ, ఫైర్ స్టేషన్ సిబ్బంది, నాయకులు చిల్ల శ్రావణ్ కుమార్, కొత్త గంగారెడ్డి, ముద్దం తిరుపతిగౌడ్ , మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**కథలాపూర్ అక్టోబర్ 17 (జనంసాక్షి)**



కథలాపూర్ మండలంలోని దోలూరు శివారులో ఉన్న పెద్ద వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ని రెవెన్యూ అధికారులు పట్టుకోవడం జరిగింది. ట్రాక్టర్ ను రెవెన్యూ అధికారులు స్థానిక పోలీస్ స్టేషన్ కీ తరలించరు. ట్రాక్టర్ కమల్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ రవికిరణ్ తెలియజేశారు.

### పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ రజియా బేగం బట్టల పంపిణీ




**కథలాపూర్ అక్టోబర్ 17 (జనంసాక్షి )**

కథలాపూర్ మండలంలోని దులూరు గ్రామంలో పారిశుద్ధ్య కార్మికుల కు బట్టల పంపిణీ చేసిన సర్పంచ్ రజియా బేగం అజీమ్ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామన్ని అభివృద్ధి లో సర్పంచ్ తో పాటు ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికులే అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ,పాలకవర్గం గ్రామ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

# అసత్యాలు మాట్లాడొద్దు

◆కార్మికులను మభ్య పెట్టొద్దు..

◆కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి..

◆ టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి..




**గోదావరిఖని, జనంసాక్షి :**
సత్యాలు మాట్లాడొద్దు.. కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలనీ టీబీజీకేస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. గోదావరిఖని ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు.ఆత్మ విమర్శ జరిగేటట్టుగా చేయండి.. లేదంటే ఒక మార్పు జరిగేటట్టుగా విమర్శిస్తే సహేతుకంగా ఉంటదనీ దానిని ఎవరైనా ఆహ్వానిస్తారాని ఆయన అన్నారు.

భారతదేశంలో ఉన్నటువంటి బొగ్గు పరిశ్రమలో కోల్ ఇండియాలో మెడికల్ బోర్డులు ఉన్నాయా.. లేదా సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. నెలకు ఎన్ని మెడికల్ బోర్డులు పెట్టిస్తున్నారు? ఎంతమంది ఇన్వాలిడ్ అవుతున్నారు? ఇప్పటివరకు ఎంతమందిని అప్పాయింట్ చేసింద్రు అని ఆయన పేర్కొన్నారు. సింగరేణిలో బి.ఆర్.ఎస్. హయాంలో, టి.బి.జి.కె.ఎస్. హయాంలో 113 మెడికల్ బోర్డులు పెట్టి 13,414 మందితో పాటుగా 3100 మందికి మీరు మిగిల్చినటువంటి వాళ్లకు కూడా ఉద్యోగాలు ఇవ్వడంతో పాటుగా 4000 మంది ఎక్స్టర్నల్ గా ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు వచ్చినవి వాస్తవమా కాదా? ఆలోచించండి. దాని గురించి చెప్పండి.అంతేకాకుండా ఈరోజు సంస్థ అభివృద్ధి చెందిందా లేదా అనేదానికి లెక్కలను తీసుకుందాం. ఈరోజు ప్రొడక్షన్ చూసుకుందామా? డిస్పాచ్ చూసు కుందామా? ఓ.ఎం.ఎస్. చూసుకుందామా? ప్రొడక్టివిటీ చూసుకుందామా? లేదంటే టర్నోవర్ చూద్దామా? లాభాల వాటా చూద్దామా? ఏ దానితోటి అభివృద్ధి చెందలేదు అని చెప్తున్నారో చర్చించడానికి సిద్ధంగా ఉన్నాం.కాబట్టి మీ దగ్గర ఉన్నాయి కదా! యాజమాన్యం గాని ప్రభుత్వం దగ్గర లెక్కలతో సహా స్టాటిస్టిక్స్ ఉన్నాయి కదా! దాన్ని చూస్తే అర్థమయితలేదా మీకు? కాబట్టి ఇలాంటి చౌకబారు విమర్శలు చేయడం సరైనది కాదు అని.

అలాగే కె.సి.ఆర్. గారు హయాంలో ఇచ్చినటువంటి సంక్షేమ కార్యక్రమాలు మీ అన్ని యూనియన్ వాళ్లకు కూడా అందుతున్నాయి కదా! మీరు కూడా రిటైర్డ్ అయ్యి మీ కొడుకులకు ఉద్యోగాలు పెట్టుకున్నారు కదా! మరి ఇంకా అందుతలేదు అని అంటున్నావు?

25 లక్షల రూపాయలు తీసుకున్న వాళ్ళు కూడా మీ దగ్గర ఉన్నారు కదా కార్మికుల ఎసి సౌకర్యం 1% ఎలక్ట్రికల్ చార్జీలు రద్దు ఎవరు ఇచ్చినటువంటిది? ఇది ఈ సంక్షేమం కాదా? తల్లిదండ్రులకు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని ఇస్తుంది, కోల్ ఇండియాలో లేదు అని అంటే ఇది మా సంక్షేమం వైద్యం విషయంలో కాదా? సి.బి.ఐ.ఇ. స్కూల్ కు నాంది పలికింది కూడా మా హయాం లో అనేటువంటిది కూడా మీకు తెలివి లేదా?అలాగే క్యాథలాబ్స్ గోదావరిఖనిలో కట్టినటువంటిది కూడా మా హయాంలో స్టార్ట్ అయింది అనేటువంటి విషయాన్ని మర్చిపోతున్నావా? ఈరోజు మెడికల్ కాలేజ్ 500 కోట్ల సి.ఎస్.ఆర్. నిధులతో కట్టినటువంటి దాంట్లో మెడికల్ సీట్ ద్వారా ఒక్కొక్క కార్మికుని పిల్లలకు ఈ కోటి రూపాయలు మిగులుతున్నది సంవత్సరానికి ఏడుగురు మంది చొప్పున ఇప్పటికి ఆరేళ్ల 4 కార్మికులకు 42 కోట్ల రూపాయలు మిగిలించింది మా వలన కాదా?ఇది విద్య విషయంలో మేము చేసినటువంటిది కాదా? కాబట్టి ఇలాంటి అన్నీ కూడా మర్చిపోయి ఈరోజు మాట్లాడుతా ఉంటే ఈరోజు మాతో పాటు మీ ట్రేడ్ యూనియన్ నాయకులకు కూడా ఏసీ ఉచితంగా ఇచ్చినటువంటిది దేశంలో ఏ సంస్థ వాళ్ళైనా కామ్రేడ్ చెప్పాలి. పక్కన ఉన్న ఎన్.టి.పి.సి. లో గాని చూసి ఎవరికి ఇస్తున్నారు ఇంత గొప్పగా? ఈరోజు వృతి పన్నును శాశ్వతంగా రద్దు చేసింది ఎవరు? ఈరోజు ఇన్కమ్ ట్యాక్స్ ను అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపింది ఎవరు?ఆ తెలంగాణ ఇంక్రిమెంట్ ఇచ్చింది ఎవరు? వడ్డీ లేని రుణం ఇచ్చినటువంటి 10 లక్షలకు ఇచ్చినటువంటిది ఎవరు?మరి మీరు ఇచ్చా మీరు చెప్పినటువంటి 250 ఎకరా భూమి ఏమైంది? సొంత ఇంటి పథకం ఏమైంది? క్వార్టర్లు వాళ్ళ పేరు మీద చేస్తా అన్నది ఏమైంది? 20 లక్షల వడ్డీ లేని రుణం ఏమైంది? సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏమైంది? మారుపేర్ల సమస్య పరిష్కారం ఏమైంది? డిస్మిస్ కార్మికుల యొక్క పరిష్కారం ఏమైంది? ఇంకా కమిటీల పేరు మీద మూడేళ్లు అయినా గాని ఇంకా పరిష్కారం కానుంటా ఈ రెండు ఏళ్లల్లో చేస్తా అనేటువంటి నమ్మకం ఏమన్నా ఉందా?

లాభాల వాటా మీద కూడా స్పష్టత లేనటువంటి రెండేళ్లలో 6,324 కోట్ల రూపాయలను పక్కన పెట్టినటువంటి పైసలకు సమాధానం చెప్పండి అయింది. ఈ సంవత్సరం 1754 కోట్ల రూపాయలలో మళ్ళీ అదే 34% పంచి ఈరోజు ఒక్కొక్క కార్మికునికి 1,53,000 చిల్లర వస్తే 40, 45,000 రూపాయలు ఒక్కొక్క కార్మికునికి తగ్గుదల వస్తే ఏం మాట్లాడుతున్నావ్?

ఈరోజు కేసీఆర్ గారి హయాంలో తక్కువ లాభాలు వచ్చినప్పుడు ఒక్కటి కాదు రెండు శాతం లాభాల వాటాను పెంచినటువంటిది. ఈరోజు 16% ఉన్నటువంటి లాభాల వాటాను 32 వరకు తీసుకొచ్చినటువంటిది ఎవరు?కాబట్టి ఇంత గొప్పగా సింగరేణి సంస్థను అభివృద్ధి పతంలో నిలిపి కార్మికులకు హక్కులు తీసుకొచ్చి సంక్షేమం, విద్య, వైద్యం, ఆర్థిక ప్రయోజనాలు కల్పించింది 9 1/2 సంవత్సరాల బి.ఆర్.ఎస్. పాలన, 11 సంవత్సరాల తెలంగాణ బొగ్గని కార్మిక సంఘం పరిపాలనలో అనేటువంటిది గుర్తుపెట్టుకొని మాట్లాడమని కోరుతా ఉన్నాం. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు తెలివి తెచ్చుకోవాలని సూచిస్తున్నాంవిలేకరుల సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మాధాసు రామూర్తి , సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, కోశాధికారి చెల్పూరి సతీష్ , కేంద్ర నాయకులు ఇందూరు సత్యనారాయణ, పోలాడి శ్రీనివాసరావు, జోసెఫ్, గోపి , జోసెఫ్, తిరుపతి, సతీష్, గోపి, ప్రమోద్, యాకూబ్ పాషా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## మైతాపూర్ దుర్గామాత ఆలయంలో

# భక్తుల సౌకర్యాలకు భూమిపూజ

### మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.3 లక్షలతో భూమిపూజ చేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**రాయికల్ అక్టోబర్ జనంసాక్షి :**
రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలోని దుర్గామాత ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం గ్రామపంచాయతీ నిధులు రూ.3 లక్షలతో నిర్మించనున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులకు వారి ఆహ్వానం మేరకు హాజరైన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ భూమిపూజ చేశారు.అంతకుముందు దుర్గామాత ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామ ప్రజల వినతి మేరకు దుర్గామాత ఆలయ ఆవరణలో అన్నదాన షెడ్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయ అభివృద్ధికి,గ్రామ అభివృద్ధి కి అవసరమైన సహకారం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ తలారి నాగమణి రాజేష్, ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ రవీందర్ రావు, పీఏసీఎస్ చైర్మన్లు ఏనుగుల మల్లారెడ్డి, మరిపల్లి శ్రీనివాస్ గౌడ్,ఉపసర్పంచ్ ప్రణయ్, ఎంపీడీఓ చిరంజీవి, ఎంఆర్ఓ నాగార్జున, మాజీ ఏఎంసీ చైర్మన్ గనే రాజిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గుజ్జల మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు కోలా శ్రీనివాస్, సర్పంచులు మోహన్ బెజ్జంకి, మహేందర్, గ్రామ నాయకులు నారాయణ, బాబు, లక్ష్మణ్, మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# న్యూ హనుమాన్ నగర్‌లో ఘనంగా యంగ్ స్టార్ 12వ వార్షికోత్సవం

### అమ్మవారికి ప్రత్యేక పూజలు.. భక్తులకు అన్నదానం

### పాల్గొన్న బీఆర్ఎస్ నాయకురాలు చేరాల లహరిక, బిజెపి నాయకులు

**గంభీరావుపేట, జనంసాక్షి:**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని న్యూ హనుమాన్ నగర్‌లో యంగ్ స్టార్ ఆధ్వర్యంలో 12వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.
వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు చేరాల లహరి, తోపాటు బిజెపి నాయకులు మండల అధ్యక్షుడు కోడె రమేష్ మల్లేష్ , బండా దేవయ్య,యాదవ్ కొక్కు దేవేందర్, సర్వోత్తమ్ ఎక్కాల దేవి చంద్రం, పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.ఈ సందర్భంగా యంగ్ స్టార్ యూత్ సభ్యులు మాట్లాడుతూ, తమ సంఘం 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన దాతలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. భక్తి, సేవాభావంతో నిర్వహించిన ఈ వార్షికోత్సవ వేడుకలు న్యూ హనుమాన్ నగర్‌లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపాయి.



# సద్దుల బతుకమ్మకు అన్ని ఏర్పాట్లు పూర్తి

### ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి

### సర్పంచ్ మల్లు గారి పద్మ నర్సా గౌడ్



**గంభీరావుపేట, అక్టోబర్ 17 (జనంసాక్షి):**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో నేడు జరగనున్న సద్దుల బతుకమ్మ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సర్పంచ్ మల్లు గారి పద్మ నర్సా గౌడ్ తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రకృతిని ఆరాధిస్తూ, ఆడపడుచులంతా ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా బతుకమ్మ ఘాట్ల వద్ద అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని, మహిళలు, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండుగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే ఆడపడుచులకు, పట్టణ ప్రజలకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రకృతితో మమేకమై, పూలను పూజిస్తూ సంప్రదాయాలను చాటిచెప్పే బతుకమ్మ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని ఆమె ఆకాంక్షించారు.



# బతుకమ్మ ఘాటును పరిశీలించిన డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి

**ముస్తాబాద్ అక్టోబర్ 17 (జనం సాక్షి)**
ముస్తాబాద్ మండలం మొర్రాయిపల్లె గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన బతుకమ్మ ఘాటును సర్పంచ్ మెంగని శ్రీనివాస ఆధ్వర్యంలో సందర్శించిన సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి,కార్యదర్శి రాజు,వార్డు సభ్యులు కారోబార్ రాజు, కుడుకల జనర్ధన్,బద్దిపడిగే పద్మ రెడ్డి, గూడా రాజిరెడ్డి, దొంత నాగరాజు సాడిమేల శంకర్, సిరిపురం దేవరాజు, గూడా బాల్ రెడ్డి, పల్లె విజయ్,గ్రామస్తులు గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# అక్రమాలు, స్కాములకు కేరాఫ్ బీఆర్ఎస్ ప్రభుత్వమే!

**○మాది స్కాముల కాంగ్రెస్ కాదు.. స్కీముల కాంగ్రెస్.. ○కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సూరదేవరాజు ఘాటు విమర్శలు**




**సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 17 (జనంసాక్షి):**
గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ప్రజల సొమ్మును దుర్వినియోగం చేశారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సూరదేవరాజు తీవ్రంగా విమర్శిం చారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, తమది 'స్కాముల కాంగ్రెస్ కాదు, స్కీముల కాంగ్రెస్' అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలు సరికావని అన్నారు.

**ప్రజాధనం దుర్వినియోగం చేశారని ఆరోపణ.**

బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని, ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తూ ఫామ్‌హౌస్‌లు, హోటళ్ల కొనుగోళ్లపై దృష్టి పెట్టారని సూరదేవరాజు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలోనూ భారీగా నిధులు వెచ్చించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపిస్తూ, ఈ అంశాలపై బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**రైతుల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం**

ఎల్‌నినో ప్రభావంతో రైతులు పంట నష్టపోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోందని ఆయన తెలిపారు. రైతులకు అవగాహన కల్పిస్తూ, పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచిస్తున్నట్లు చెప్పారు. గతంలో రైతులకు సరైన అవగాహన కల్పించకపోవడం వల్ల నష్టాలు సంభవించాయని, రైతుల మరణాలకు సంబంధిం చిన అంశాన్ని కూడా గత పాలకులు పరిశీలిం చాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు పండించిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధరతోపాటు బోనస్ అందించిందని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై బీఆర్ఎస్ నాయకులు అనవసర విమర్శలు చేస్తూ రైతులను అయోమయానికి గురిచేయవద్దని హితవు పలికారు.

**విద్యుత్ సంక్షోభానికి గత పాలకులే కారణం.**

రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభానికి బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాలే కారణమని సూరదేవరాజు ఆరోపించారు. సింగరేణి బొగ్గు గనుల్లో అధికారుల నియామకాలు, బదిలీల వ్యవహారంలో అవకతవకలు జరిగాయని, వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందంటూ విమర్శించారు. ఈ అంశాలపై సమాధానం చెప్ప కుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదన్నారు. రాజకీయ లబ్ధి కోసం రైతులను తప్పు దోవ పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకునూరి బాలరాజు, నాయకులు బొప్ప దేవయ్య, గాజుల నరేష్, పత్తిపాక లక్ష్మీరాజం, వెంగళ అశోక్, రాగుల జగన్, బూర యాదగిరి, ఇప్పపూర్ణ లక్ష్మణ్, వంగరి అనిల్, గాజుల సాగర్, అలువాల సత్యనారాయణ, కొండ ప్రకాష్, సదుల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



## బతుకమ్మ, దసరా సందర్భంగా పంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాల పంపిణీ

**ఇల్లంతకుంట అక్టోబర్ 17 (జనంసాక్షి):**
బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని జంగంరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ పండుగ సునీత, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. పారిశుధ్య పనుల నిర్వహణకు అవసరమైన శానిటేషన్ సామగ్రిని సైతం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సునీత మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, ప్రజలకు అవసరమైన సేవలు అందించడం, గ్రామ అభివృద్ధిలో పంచాయతీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. పండుగ వేళ సిబ్బందికి నూతన వస్త్రాలు, పారిశుధ్య సామగ్రి అందించడంపై సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు

## పెద్దపల్లిలో విజయదశమి రోజు రావణ దహన కార్యక్రమం

పెద్దపల్లి,అక్టోబర్ 17(జనంసాక్షి) :
విజయదశమి ఉత్సవాలను పురస్కరించుకొని పెద్దపల్లి మున్సిపల్ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే రామ్‌లీలా (రావణ దహనం) ఏర్పాట్లను స్థానిక ప్రజాప్రతినిధులతో, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించి దసరా రోజున జరిగే రావణ దహన కార్యక్రమానికి ప్రజలందరూ హాజరు కావాలని కోరిన ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు. ఈ కార్య క్రమం లో మున్సిపల్ చైర్మన్, కమిషనర్,కౌన్సిలర్లు మరియు సింగిల్ విండో చైర్మన్ మరియు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు మరియు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గల్ఫ్ పై మిట్టపల్లి బతుకమ్మ పాట..

**నేడు దుబాయ్ లో ఆవిష్కరణ..**

**గోదావరిఖని, జనంసాక్షి :**
ఎడారిలో తంగేడు వనమే మొలిసేనో అంటూ సాగే బతుకమ్మ పాటని అక్షర గోల్డ్ అండ్ డైమండ్స్ జ్యువలరీ గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మన్ కోట కుమార్ (కె కె) నిర్మించగా ఈ గీతానికి ప్రముఖ తెలంగాణ ప్రజా కవి గాయకుడు మిట్టపల్లి సురేందర్ సాహిత్యాన్ని అందించారు గుండెను తట్టిలేపుతున్న ఈ గేయాన్ని మంగ్లీ ఆలపించగ నేపథ్య సంగీతం మదీన్ ఎస్కే సమకూర్చారు. దుబాయ్ లో వలస కార్మికుల అన్న చెల్లెళ్ళ గోస ప్రతిబింబించేలా ఉన్న ఈ పాట సొంత ఊరిలో పండుగ జరుపుకోవాలని ఎంతో ఆశ ఉన్నప్పటికీ గల్ఫ్ లో బతుకుపోరు రీత్యా అయినవాళ్ళమధ్య సొంత ఊరిలో పండగ జరుపుకోలేని తెలంగాణ ఆడ బిడ్డలకు అన్నదమ్ములకు ఈ గీతం మధుర స్మృతులను మిగిల్చేలా ఉంది ఈ పాటలో సాహిత్యం దూదు సేమియాకు సత్తు బెల్లానికి కలిపిన బంధం కర్జూర తీపికి బతుకమ్మ బాణీకి అద్దిన మాధుర్యం రెండు మతాలమధ్య రెండు విభిన్న సంప్రదాయాల మధ్య ఉన్న సామరస్యాన్ని అనుబంధాన్ని దుబాయి వేదికగా గల్ఫ్ నుండి గళమెత్తి ప్రపంచానికి హిందూ ముస్లిం భాయి భాయి అని సరికొత్తగా బతుకమ్మ పాట రూపంలో వినిపించింది తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఐన ఈ బతుకమ్మ పండుగ సందర్భంగా దుబాయ్ బతుకమ్మ పాటని గొలుగొండ కోటనుండి బురుజుఖలీఫా దాకా ఏడు దేశాలను ఏడు రంగుల లెక్క అద్ది బురుజు ఖలీఫా అంత ఎత్తైన బతుకమ్మ పాటను పేర్చి మిట్టపల్లి స్టూడియో ద్వారా ఇటు తెలంగాణ అటు గల్ఫ్ లో ఉన్న ఆడబిడ్డలకు ఈ పాటను అంకితమిచ్చారు అక్షర గ్రూప్స్ చైర్మన్ కోట కుమార్. ఈ కార్యక్రమంలో భారతదేశం తెలంగాణ నుండి సంప్రదాయ వాయిధ్యాలైన డప్పు బృందాలు, ఒగ్గుడోలు బృందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దుబాయితో పాటు అబుదబి నుండి పెద్దసంఖ్యలో కార్మికులు వారికుటుంబాలు పాల్గొని బతుకమ్మ పండుగని విజయవంతం చేసిన ఈ కార్యక్రమాన్ని స్పార్క్ మీడియా, సుతారి సత్యం మల్లేష్ గౌడ్ నిర్వహించారు.



## జూనియర్ సివిల్ న్యాయమూర్తులు గా బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఆడబిడ్డలు

పెద్దపల్లి,అక్టోబర్ 17(జనంసాక్షి) : తెలంగాణ హైకోర్టు ఇటీవల విడుదల చేసిన ఫలితాలలో పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు ఎంపికయ్యారు. వేముల లక్ష్మీ వైకుంఠం దంపతుల కుమార్తె వేముల హారిక,చిప్ప లత -రాజేశ్వర్ దంపతుల కుమార్తె చిప్ప సౌమ్య జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికయ్యారు. జడ్జీలుగా ఎంపికైన వారి స్వస్థలం బ్రాహ్మణపల్లి కాగా వృత్తి రీత్యా ఇతర ప్రాంతాలలో పని చేశారు. కాగా బ్రాహ్మణపల్లి గ్రామానికి వచ్చిన ఇద్దరు మహిళలు జడ్జీలుగా ఎంపిక కావడం పట్ల పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు చిప్ప భాస్కర్ హర్షం వ్యక్తం చేస్తూ వారికి అభినందనలు తెలిపారు.

# శ్రీ అంబ భవాని ఆలయంలో వైభవంగా శరన్నవరాత్రోత్సవాలు

**శ్రీ మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు**

**సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 17 (జనంసాక్షి):**
సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూ నగర్ శ్రీ అంబ భవాని దేవాలయంలో శరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శనివారం శ్రీ మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు, హోమం తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం 6:30 గంటలకు శ్రీ మహాలక్ష్మి దేవి, కూష్మాండ దేవి పూజలు, షోడశోపచార పూజలు, హారతి కార్యక్రమాలను ఆలయ పండితులు శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు శ్రీధర్ శర్మ మాట్లాడుతూ, శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారిని శ్రీ మహాలక్ష్మి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించినట్లు తెలిపారు. ఆదివారం అమ్మవారిని శ్రీ దుర్గాదేవి అలంకరణలో కొలువుదీర్చనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అభిషేక పూజ, శ్రీ దుర్గాదేవి హోమం, కూష్మాండ దేవి పూజ, హారతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి ఒడిబియ్యం, కానుకలు సమర్పించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. శ్రీ అంబ భవాని దేవాలయ అధ్యక్షులు, కార్యనిర్వాహకులు చిలుక నారాయణ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా శరన్నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొంటున్నారని, అమ్మవారిపై భక్తులకు అపారమైన విశ్వాసం ఉందని పేర్కొన్నారు. భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, చందా రూపంలో విరాళాలు అందిస్తున్నారని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన వసతులు, సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ పూజా



కార్యక్రమాల్లో ఆలయ కార్యదర్శి గాజుల భాస్కర్‌తో పాటు తాటి వెంకన్న, ఎలిగేటి రామానుజం, దూస వేణు, కట్ల సంజీవ్, బూర భాస్కర్ (బాబి), ఆడెపు శ్రీనివాస్, పోలు నారాయణ, ఐరేని సౌజన్య, కట్ల శ్యామల, జక్కని మల్లవ్వ, ఆడెపు కనుకవ్వ తదితరులు పాల్గొన్నారు.

# రవాణా శాఖలో అవినీతి వేర్లు

## వేటు పడిన హోంగార్డులు

ం శాఖాపరమైన చర్యలపై సర్వత్రా చర్చ..
ం ఆర్మూర్ యూనిట్, మొబైల్ స్క్వాడ్‌లలో ఏళ్ల తరబడి తిష్ట
ం విచారణ చేపట్టి మాతృశాఖకు సరెండర్ చేసిన డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ దుర్గాప్రమీల

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 17 జనం సాక్షి :**
నిజామాబాద్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో అవినీతి ఆరోపణలు ఒక్కసారిగా కలకలం సృష్టించాయి. శాఖ పరిధిలో కీలక బాధ్యతల్లో ఉంటూ, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్న తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు హోంగార్డులపై రవాణా శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. వారిని తక్షణమే వారి మాతృశాఖకు సరెండర్ చేస్తూ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ దురాగ్రమీల సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆర్టీఏ పరిధిలోని ఆర్మూర్ యూనిట్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న బి. దశరథ్‌తో పాటు, ఉమ్మడి జిల్లా మొబైల్ స్క్వాడ్‌లో కొనసాగుతున్న మరో హోంగార్డు భాస్కర్‌లపై గత కొంతకాలంగా తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాహనాల తనిఖీల పేరుతోనూ, ఇతరత్రా పనుల నిమిత్తం ప్రజల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు అధికారుల దృష్టికి వెళ్లాయి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై ఆరా తీసి, అంతర్గత విచారణ జరిపినట్లు తెలుస్తోంది. విచారణలో ఆరోపణలు ప్రాథమికంగా రుజువు కావడంతోనే వారిని తక్షణమే సరెండర్ చేయాలని నిర్ణయించినట్లు డీటీసీ దుర్గాప్రమీల స్పష్టం చేశారు.

**…ఏళ్ల తరబడి ఒకేచోట తిష్ట**

నిబంధనల ప్రకారం ఒకే కార్యాలయంలో లేదా ఒకే యూనిట్‌లో దీర్ఘకాలికంగా పనిచేయకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ, ఈ హోంగార్డులు మాత్రం 2008 కాలం నాటి నుంచి లేదా ఆ తర్వాత రిక్రూట్ అయినప్పటి నుంచి ఏళ్ల తరబడి ఆర్టీఏ కార్యాలయ పరిధిలోనే తిష్ట వేసినట్లు తేలింది. సుదీర్ఘకాలంగా ఒకే చోట స్థిరపడటం వల్లనే వారు తమ అధికారాలను దుర్వినియోగం చేస్తూ అవినీతికి పాల్పడటానికి ధైర్యం చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**మారిన రవాణా శాఖ తీరు.. ప్రక్షాళన దిశగా అడుగులు?**

రవాణా శాఖలో కొందరు సిబ్బంది వ్యవ???శైలి వల్ల శాఖకు చెడ్డపేరు వస్తోందన్న వాదనలు ఎప్పటి నుంచో ఉన్నాయి. తాజాగా డీటీసీ దుర్గాప్రమీల తీసుకున్న ఈ నిర్ణయం శాఖలో అవినీతికి పాల్పడే వారికి గట్టి హెచ్చరికగా మారిందని చెప్పవచ్చు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే కిందిస్థాయి సిబ్బందిపైనే కాకుండా, వారికి సహకరిస్తున్న మరికొందరిపై కూడా దృష్టి సారించాలని ప్రజాసంఘాలు కోరుతున్నాయి. రానున్న రోజుల్లో రవాణా శాఖలో మరిన్ని ప్రక్షాళన చర్యలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది.

# రైతులకు మద్దతుగా 23న కలెక్టరేట్ ముందు బీజేపీ ధర్నా



**గన్నేరువరం, అక్టోబర్ 17 (జనంసాక్షి):**
రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా నిర్వహించనున్నట్లు మండల ఇంచార్జ్ సంపెల్లి సంపత్ రావు తెలిపారు. శనివారం గన్నేరువరం మండల కేంద్రంలోని బీజేపీ మండల పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ… రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. విద్యుత్ కొరత, సాగునీటి సమస్యల కారణంగా పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని, రైతులకు జరుగుతున్న నష్టానికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నాకు మండలం నుండి స్వచ్ఛందంగా రైతులు, బీజేపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రైతుల సమస్యలపై బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. అలాగే క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు బొమ్మిడి సురేందర్ రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షులు మచ్చ సాయి కృష్ణ, నాయకులు పుల్లెల జగన్ మోహన్, మునిగంటి లింగయ్య, దానవేణి ప్రశాంత్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కులమతాలకు అతీతంగా మానవత్వమే ముఖ్యం

ం వర్షాలు సమృద్ధిగా కురిసి సాగునీటి సమస్యలు తీరాలి.. రైతులను ఆదుకోవాలి
ం ఏబీపీఎస్ జాతీయ అధ్యక్షుడు ప్రబోధ్ సుమేర్



**భీంగల్ అక్టోబర్ 17 జనంసాక్షి:**
కులమతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా ఉండాలని, మానవత్వం, సోదర భావం, మంచి నడవడిక, నైతిక విలువలకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలని ఏబీపీఎస్ జాతీయ అధ్యక్షుడు ప్రబోధ్ సుమేర్ పిలుపునిచ్చారు. దేవీ శరన్నవరాత్రులు, బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని భీమ్‌గల్ మండలం దేవన్‌పల్లి గ్రామానికి చెందిన ఏబీపీఎస్ జాతీయ అధ్యక్షుడు ప్రబోధ్ సుమేర్ భీమ్‌గల్ పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల పరిధి ప్రజలకు, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటేనని, సమాజంలో ప్రేమ, పరస్పర గౌరవం, మానవత్వం వెల్లివిరిసి నప్పుడే నిజమైన ఐక్యత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పండుగలు ప్రజల మధ్య సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు ఐక్యతను చాటాలని ఆకాంక్షించారు.

**రైతుల కష్టాలు తీరాలి.. వర్షాలు కురవాలి**

భీమ్‌గల్ ప్రాంత ప్రజల జీవనాధారం ప్రధానంగా వ్యవసాయమేనని, వర్షాలు తగ్గడంతో రైతులు సాగునీటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రబోధ్ సుమేర్ ఆవేదన వ్యక్తం చేశారు. తల్లి దుర్గమ్మ కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని, చెరువులు, కుంటలు నిండి సాగునీటి సమస్యలు తొలగిపోవాలని ప్రార్థించారు. పంటలు పుష్కలంగా పండి రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని, వ్యవసాయంపై ఆధారపడిన పేదలకు ఆర్థిక ఇబ్బందులు తొలగాలని ఆకాంక్షించారు.

**ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలి**

దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలు, సంతోషాలు నింపాలని ఆయన అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజల సమస్యలు తొలగిపోయి అందరికీ ఆరోగ్యం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకుంటూ పరస్పర సహకారం, మానవత్వంతో ముందుకు సాగాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# నూతన చట్టాలు వ్యక్తుల అక్రమ రవాణా నిరోధకం

## న్యాయసలహాలు అందించిన డిప్యూటీ డైరెక్టర్ మలక్ పేట్ రజిని



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 16 జనంసాక్షి:**
తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ యస్. సాంబశివ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మలక్పేట్ రజిని నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో ఆర్గనైజింగ్ కేసుల గురించి క్షుప్తంగా వివరించారు. మరియు కొత్తగా వచ్చిన బి ఎన్ ఎస్ చట్టం గురించి, భారత ప్రభుత్వ హోం వ్యవహారాల శాఖా మంత్రి జారీ చేసిన వ్యక్తుల అక్రమ రవాణా నిరోధకం గురించి చర్చ జరిగింది. మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి సాంకేతికంగా ఏలా ఉపయోగించాలో సమర్థవంతంగా ఇట్టి నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వాల నాయకత్వం, చొరవ మరియు బాధ్యత, ఎంతో కీలకమని వివరించడం జరిగింది.. ఈ కార్యక్రమానికి అధ్యక్షతగా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ యం. రజిని వ్యవహరించారు. ఈ సమావేశంలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.

# చిన్నపిల్లల ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

## బాబాపూర్ గ్రామ సర్పంచ్ ఎం.ఏ. సమీర్ పిలుపు



**భీమ్‌గల్,అక్టోబర్ 17 జనం సాక్షి:**
గ్రామంలోని చిన్నపిల్లలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్న ఆరోగ్య శిబిరాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని బాబాపూర్ గ్రామ సర్పంచ్ ఎం.ఏ. సమీర్ కోరారు. నిజామాబాద్‌లోని ఆర్యన్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో డాక్టర్ సమద్ నేతృత్వంలో ఆరుగురు చిన్న పిల్లల డాక్టర్ బృందంతో కలిసి ఆదివారం భీమ్‌గల్ మండలంలోని బాబాపూర్ గ్రామ కమిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎం.ఏ. సమీర్ మాట్లాడుతూ.. చిన్నపిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పిల్లలకు అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహాలు తీసుకోవాలని తెలిపారు. ఈ ఉచిత శిబిరం ద్వారా పిల్లలకు వైద్య పరీక్షలు చేయించుకునే అవకాశం ఉందని, గ్రామంలోని తల్లిదండ్రులందరూ తమ పిల్లలను శిబిరానికి తీసుకువచ్చి వైద్య సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు.

# గన్నేరువరం మండలంలో దసరా పేరుతో నకిలీ విలేకరుల హల్ చల్!

జనంసాక్షి ప్రత్యేక కథనం

## సర్పంచ్ లే టార్గెట్ గా.. 5 నుంచి 10 వేల వరకు వసూళ్లు.. భయంతో బిక్కుబిక్కుమంటున్న గ్రామ పాలకులు

**గన్నేరువరం, అక్టోబర్ 17 (జనంసాక్షి):**
గన్నేరువరం మండలంలో దసరా పండుగను అడ్డం పెట్టుకుని కొందరు నకిలీ విలేకరులు రెచ్చిపోతున్నారు. చేతిలో ప్రెస్ కార్డు, భుజాన బ్యాగ్ తగిలించుకుని తామే పెద్ద విలేకరులమంటూ గ్రామాల్లో చక్కర్లు కొడుతూ సర్పంచ్ లను, అధికారులను ముక్కుపిండి వసూలు చేస్తున్న తీరు మండలంలో హాట్ టాపిక్ గా మారింది. మండలంలోని దాదాపు ప్రతి గ్రామ పంచాయతీకి వెళ్లి "మేము ఫలానా పెద్ద పేపర్, ఫలానా పెద్ద ఛానల్ నుంచి వచ్చాము. దసరా పండుగకు మా సహకారం ఇవ్వండి. లేదంటే మీ పంచాయతీలో జరిగిన అవకతవకలపై వార్తలు రాస్తాం" అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధిత సర్పంచ్ లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరికీ సరైన అక్రిడిటేషన్ లేదు, ఏ పేపర్ లో వీరి పేర్లు లేవు. అయినా సొంతంగా ప్రింట్ చేయించుకున్న ప్రెస్ కార్డులతో హల్ చల్ చేస్తున్నారు. గ్రామాల్లో అమాయక సర్పంచ్ లు భయపడి రూ. 3 వేల నుంచి రూ. 5 వేల వరకు ముట్టజెప్పినట్లు సమాచారం. ఇవ్వని వారి పంచాయతీల వద్ద ఫోటోలు తీసి, వీడియోలు చేసి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. నిజమైన జర్నలిస్టులకు ఈ నకిలీ గాళ్ల వల్ల చెడ్డ పేరు వస్తోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, సీపీ, సమాచార శాఖ ఉన్నతాధికారులు స్పందించి, మండలంలో తిరుగుతున్న నకిలీ విలేకరులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గన్నేరువరం మండల సర్పంచ్ లు డిమాండ్ చేస్తున్నారు.



# అక్రమ వడ్డీ వ్యాపారులపై నిజామాబాద్ పోలీసుల మెరుపు దాడులు

◆67 ప్రాంతాల్లో తనిఖీలు , 42 చోట్ల చెక్కులు , ప్రామిసరీ నోట్లు , బాండ్ పేపర్స్ , నగదు స్వాధీనం

◆అక్రమ వడ్డీ వ్యాపారాలపై కఠిన చర్యలు తప్పవు:పోలీస్ కమిషనర్ వెల్లడి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 17 జనంసాక్షి:**
నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిజామాబాదు , ఆర్మూర్ , బోధన్ డివిజన్ పరిధిలో ప్రజలను అధిక వడ్డీల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తూ,అక్రమంగా వడ్డీ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు శనివారం నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ పోలీస్ డివిజన్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉదయం నుండి పోలీసులు విస్తృతంగా మెరుపు దాడులు నిర్వహించారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా పోలీసు అధికారులు , సిబ్బంది సంబంధిత వడ్డీ వ్యాపారుల ఇళ్లతో పాటు అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు చేపట్టారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం 67 ప్రాంతాల్లో మెరుపు దాడులు నిర్వహించగా , 42 ప్రాంతాల్లో చెక్కులు, ప్రామిసరీ నోట్లు , నగదు తదితర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ వడ్డీ వ్యాపారాలకు సంబంధించిన ఆధారాలపై పోలీసులు పరిశీలన చేపట్టి , నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునేందుకు చర్యలు చేపట్టారు.

**పోలీస్ కమిషనర్ హెచ్చరిక**

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య మాట్లాడుతూ ప్రజల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకొని అధిక వడ్డీలు వసూలు చేస్తూ , అప్పులు తీసుకున్న వారిని వేధింపులకు గురిచేసే అక్రమ వడ్డీ వ్యాపారులపై పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధమైన వడ్డీ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ప్రత్యేక తనిఖీలు , దాడులు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. అప్పుల పేరుతో ప్రజలను బెదిరించడం , బలవంతంగా చెక్కులు లేదా ఇతర పత్రాలు తీసుకోవడం , చట్ట విరుద్ధంగా అధిక వడ్డీలు వసూలు చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు



ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే అక్రమ వడ్డీ వ్యాపారాలపై పోలీస్ శాఖ ఉక్కుపాదం మోపుతుందని , బాధితులకు న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి అక్రమ వడ్డీ వ్యాపారులు లేదా అధిక వడ్డీల పేరుతో వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తుల గురించి సమాచారం తెలిసినా, బాధితులుగా ఉన్నా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని పోలీస్ శాఖ సూచించింది.

# నిజామాబాద్ బస్టాండ్ లో 'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమం



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 17 జనంసాక్షి:** మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల మరియు ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ బస్టాండులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా బేటీ బచావో బేటీ పడావో లోగోతో పాటు అత్యవసర సహాయ హెల్ప్‌లైన్ నంబర్లతో కూడిన హ్యాండిల్స్‌ను బస్సుల్లో ఫిట్ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటరమణ , జిల్లా సంక్షేమ అధికారి సౌందర్య , అర్బన్ సీడీపీఓ విజయ లక్ష్మి , డిపో ఒఇ వసుంధర , జిల్లా మిషన్ కోఆర్డినేటర్ స్వప్న చేతుల మీదుగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో భాగంగా జిల్లా సంక్షేమ అధికారి సౌందర్య మాట్లాడుతూ బాలికల రక్షణ, విద్య, మహిళల భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం, అత్యవసర పరిస్థితుల్లో హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకునేలా ప్రజలను చైతన్యపరచడం ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# వజ్జపల్లిలో వైభవంగా దుర్గామాతకు కుంకుమార్చన

**భక్తిశ్రద్ధలతో పూజలు.. అనంతరం అన్నదాన కార్యక్రమం**



**సదాశివనగర్ అక్టోబర్ 17 (జనంసాక్షి)**
సదాశివనగర్ మండలం వజ్జపల్లి గ్రామంలో దుర్గామాతకు భక్తి శ్రద్ధ లతో కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దుర్గామాత ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. భక్తుల భాగస్వామ్యంతో పూజా కార్యక్రమాలు, అన్నదానం భక్తిశ్రద్ధల మధ్య కొనసాగాయి.

# బస్సులో యువతికి తీవ్ర అస్వస్థత

**- సకాలంలో ఆసుపత్రికి తరలింపు**

**- మానవత్వం చాటుకున్న అబ్దుల్ హకీమ్**



**సుల్తానాబాద్,అక్టోబర్ 17(జనంసాక్షి) :**
హైదరాబాద్ నుంచి గోదావరిఖనికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో శనివారం ఓ యువతి అకస్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురై స్పృహ కోల్పోయింది.తోటి ప్రయాణికుడైన అబ్దుల్ హకీమ్ తక్షణమే స్పందించి ఆమెను ఆసుపత్రికి తరలించడంతో ప్రాణపాయం తప్పింది.వివరాల్లోకి వెళ్తే, హైదరాబాద్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు సుల్తానాబాద్ సమీపం లోకి రాగానే, బస్సులో ప్రయాణిస్తున్న ఓ యువతికి అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి కిందపడిపోయి స్పృహ కోల్పోం యంది. దీంతో బస్సులోని ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు.ఆ సమయంలో అదే బస్సులో ప్రయాణిస్తున్న అబ్దుల్ హకీమ్ వెంటనే స్పందించి, ఏమాత్రం ఆలస్యం చేయకుండా మానవతా దృక్పథంతో యువతిని సుల్తానాబాద్‌లోని సివిల్ ఆసుపత్రికి తరలించారు.అక్కడి వైద్యులు ఆమెకు తక్షణమే అత్యవసర వైద్య సేవలు అందించడంతో పరిస్థితి విషమించకుండా సురక్షితంగా బయటపడింది.ఆపద సమయంలో చాకచక్యంగా వ్యవహరించి, సకాలంలో వైద్యం అందేలా చూసి తోటి ప్రయాణికురాలి ప్రాణాలను కాపాడిన అబ్దుల్ హకీమ్‌ను స్థానికులు, ఆర్టీసీ సిబ్బందితో పాటు తోటి ప్రయాణికులు ప్రత్యేకంగా అభినందించారు. ఆయన చూపిన మానవత్వం పలువురి ప్రశంసలు అందుకుంటోంది.



# మండల పరిషత్ కార్యాలయంలో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు

**సుల్తానాబాద్,అక్టోబర్ 17(జనంసాక్షి) :**
బతుకమ్మ పండుగను పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో దివ్యదర్శనరావు ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఎల్పిఓ దేవకిదేవి ముఖ్య అతిథిగా హాజరై బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. వివిధ శాఖలకు చెందిన మహిళ ఉద్యోగులు మొత్తంలో హాజరై బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో దివ్య దర్శనరావు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ మహిళలకు ముఖ్యమైన పండుగ అని, భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ పద్ధతిలో బతుకమ్మ వేడుకలు జరుపుకోవాలని చాలా సంతోషమన్నారు.బతుకమ్మ వేడుకల్లో మండలంలోని మహిళా సర్పంచులతో పాటు అంగన్వాడి, ఐకెపి మహిళలు పాల్గొన్నారు.

# సద్దుల బతుకమ్మ, దసరా పండుగలను సంతోషంగా జరుపుకోవాలి

**బీజేపీ సీనియర్ నాయకులు కాశెట్టి కుమార్**



**హుజూరాబాద్, అక్టోబర్ 17 (జనంసాక్షి):**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతి రూపంగా జరుపుకునే విజయదశమి (దసరా) పండుగలను ప్రజలంతా సంతోషోత్సా హాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు కాశెట్టి కుమార్ ఆకాంక్షించారు. పండుగలను పురస్కరించుకుని హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, పూల సౌందర్యానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని కాశెట్టి కుమార్ పేర్కొన్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలు, కోలాటాలతో మహిళలు జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల వైభవాన్ని ప్రపంచానికి చాటిచెబుతుందన్నారు. ప్రకృతిని పూజిస్తూ, పూలను ఆరాధిస్తూ, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందంగా జరుపుకునే బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. మహిళల ఐక్యతకు, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. అదేవిధంగా, చెడుపై మంచి, అధర్మంపై ధర్మం, దుష్టశక్తులపై దైవశక్తుల విజయం సాధించిన మహత్తర సందర్భానికి విజయదశమి ప్రతీక అని ఆయన వివరించారు. మహిషాసురుడిపై దుర్గాదేవి సాధించిన విజయం, రావణాసురుడిపై శ్రీరాముడు సాధించిన విజయాలు ధర్మమార్గంలో నడవాలనే సందేశాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. విజయదశమి పర్వదినం ప్రతి ఒక్కరిలో ధైర్యం, ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథాన్ని పెంపొందించాలని, చెడు ఆలోచనలను విడనాడి మంచిని ఆచరించేలా ప్రేరణ కలిగించాలని అన్నారు. మనిషిలోని దుర్గుణాలే అసలైన రాక్షసత్వమని, సత్ప్రవర్తన, దయ, ధర్మం, మానవత్వమే దైవత్వానికి ప్రతిరూపాలని కాశెట్టి కుమార్ అన్నారు. దుర్గాదేవిని భక్తిశ్రద్ధలతో పూజిస్తూ, విజయదశమి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మంచిని ఆచరించాలని పిలుపునిచ్చారు. పండుగలు కేవలం ఆచారాలకే పరిమితం కాకుండా కుటుంబ బంధాలను బలోపేతం చేస్తూ, సమాజంలో ప్రేమాభిమానాలు, ఐకమత్యం, సోదరభావాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు. ఆ జగన్మాత దుర్గాదేవి ఆశీస్సులతో హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంలో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరికీ విజయాలు సిద్ధించాలని కాశెట్టి కుమార్ ఆకాంక్షించారు. సద్దుల బతుకమ్మ, విజయదశమి పండుగలను పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ, సంప్రదాయాల పరిరక్షణతో, ఆనందోత్సాహాల మధ్య వైభవంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

# ప్రభుత్వానికి ముందు చూపు లేకనే విద్యుత్ కోతలు

**కామారెడ్డి అక్టోబర్ 17 (జనంసాక్షి)**
కామారెడ్డి జిల్లా శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ..ఎలెనినో వల్ల సమస్య ఉంటుందని 6 నెలల ముందే తెలిసినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదు.గత ప్రభుత్వాన్ని విమర్శించడం పై ఉన్న శ్రద్ధ రైతుల సమస్యల పరిష్కారంపై పెట్టడం లేదుఖరీఫ్ పంటకి నీళ్ళు ఇవ్వాలి, యాసంగి పంటకి ప్రణాళిక తయారు చేయాలని లేకపోతే త్రాగు నీటికి కూడా ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుంది.రైతులకు కోతలు లేని నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనత పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు మరియు కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి ల ఆధ్వర్యంలో సబ్ డివిజన్ కార్యాలయం ముందు ధర్నా చేయటం జరిగింది.




అనంతరం విద్యుత్ ఎస్ఇ సాల్యా నాయక్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కామారెడ్డి శాసన సభ్యులు, బీజేఎల్పీ ఉపనేత శ్రీ కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి ముందు చూపు లేకనే రైతులు విద్యుత్ కోతలు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఎలెనినో వల్ల సమస్య ఉంటుందని 6 నెలల ముందే



తెలిసినా ప్రభుత్వం ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టలేదనీ,ముఖ్యమంత్రీ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కాళేశ్వరం పేరిట గత ప్రభుత్వాన్ని విమర్శించడం పై ఉన్న శ్రద్ధ రైతుల సమస్యల పరిష్కారంపై పెట్టడం లేదనీ అన్నారు. ఈ పంట కి నీళ్ళు తప్పనిసరిగా ఇవ్వాలనీ , యాసంగి పంటకి క్యాబ్ ప్రణాళిక ఇప్పుడే తయారు చేయాలనీ డిమాండ్ చేశారు. లేకపోతే త్రాగు నీటికి కూడా ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందనీ అన్నారు.

# నర్సింగ్రావుపల్లి, మర్పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- రైతులకు అండగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు.. ధాన్యం విక్రయాలకు మార్గం సుగమం
- జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ చేతుల మీదుగా ప్రారంభం



**నిజాంసాగర్, అక్టోబర్ 17 (జనంసాక్షి):** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను సకాలంలో విక్రయించుకునేందుకు, ధాన్యం అమ్మకాల సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించేందుకు నిజాంసాగర్ మండల పరిధిలోని నర్సింగ్రావుపల్లి, మర్పల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఈ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అచ్చంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ పట్లోళ్ల జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

**రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు**

వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు పంట విక్రయాలు కీలకమైన అంశం. పంట చేతికొచ్చిన సమయంలో ధాన్యాన్ని విక్రయించేందుకు సరైన కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోతే రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో నర్సింగ్రావుపల్లి, మర్పల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక రైతులకు అందుబాటులోనే ధాన్యం విక్రయించే అవకాశం కల్పించినట్లయింది. రైతులు తమ పంటను విక్రయించేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరాన్ని తగ్గించడంతో పాటు, కొనుగోలు ప్రక్రియను సులభతరం చేయడం ఈ కేంద్రాల ప్రధాన ఉద్దేశం. పంట ఉత్పత్తులను విక్రయించే సమయంలో రైతులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడటం ముఖ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగాలి**

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంతో పాటు, ధాన్యం సేకరణ ప్రక్రియ కూడా సక్రమంగా కొనసాగడం అవసరం. రైతులకు కొనుగోలు విధానంపై స్పష్టమైన సమాచారం అందించడం, ధాన్యం నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పించడం, తూకం ప్రక్రియలో పారదర్శకత పాటించడం, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులు నిబంధనల ప్రకారం జరిగేలా చూడటం కీలకంగా మారింది.

అలాగే కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని రైతులు ఆశిస్తున్నారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరగకుండా, రైతులు తమ ధాన్యాన్ని సకాలంలో విక్రయించుకునేలా ఏర్పాట్లు ఉండాలని కోరుతున్నారు.

**కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు**

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అచ్చంపేట పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల జనార్దన్ రెడ్డి, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రజా పండరి, ఆయా గ్రామాల సర్పంచులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, వార్డు సభ్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు అవసరం**

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు రైతులకు ఉపయోగకరంగా మారాలంటే కొనుగోళ్లు నిరంతరాయంగా కొనసాగడం, అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండటం, ధాన్యం సేకరణలో పారదర్శకత పాటించడం ముఖ్యమని రైతులు అభిప్రాయపడుతున్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు సకాలంలో సేవలు అందించి, వారి కష్టానికి తగిన ఫలితం దక్కేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నర్సింగ్రావుపల్లి, మర్పల్లి గ్రామాల్లో ప్రారంభమైన ఈ కేంద్రాల ద్వారా స్థానిక రైతులకు ధాన్యం విక్రయాల్లో మరింత సౌలభ్యం కలగాలని ఆశిస్తున్నారు.



# యాసంగిలో రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలి

**సిరికొండ 17. అక్టోబర్ జనంసాక్షి :** సిరికొండ మండలంలోని చిమన్ పల్లి విద్యుత్ సబ్స్టేషన్ ను ఎస్ ఈ రాజేశ్వర్ రావు, డి ఈ హరిచంద్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుల పంట పొలాలు ఎండిపోకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.జిల్లాలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని రైతులు పొదుపుగా విద్యుత్ వాడుకోవాలని రైతులకు సూచించారు.విద్యుత్ కొనే పరిస్థితి లేదని యాసంగిలో రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని అన్నారు. ఎలి నీ ప్రభావంతో ఎక్కడ కూడా ప్రాజెక్టుల్లో నీరు లేకపోవడంతో కరెంట్ ఇన్ కమింగ్ తక్కువగా ఉందని అన్నారు.రైతులు వరి సాగు తగ్గించుకోవడమే ఉత్తమమని అన్నారు.ఎండాకాలంలో ఐదు నుంచి ఆరు గంటల కరెంట్ మాత్రమే ఉండవచ్చని చెప్పారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు ఉంటే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. అనంతరం తాటిపల్లి గ్రామాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ లు నర్సయ్య, గోవిందు,చందర్. ఉప సర్పంచ్ రాజేందర్ రెడ్డి. నాయక్,బుక రాజు, శివ రెడ్డి, మహేందర్ తదితరులు ఉన్నారు.

## రెండు కోట్ల 11 లక్షలతో
# దుర్గామాత అలంకరణ



**ఆర్మూర్, అక్టోబర్ 17 (జనంసాక్షి):** ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట్ మండల కేంద్రంలో సుభాష్ నగర్ లో రెండు కోట్ల 11 లక్షల రూపాయలతో దుర్గామాత అమ్మవారి అలంకరణతో విరాజిల్లింది.శ్రీ శక్తి రూపిని దుర్గాదేవి ఉత్స కమిటీ ఆధ్వర్యంలో మూడో వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు.జిల్లాలో ఎక్కడ లేని విధంగా కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు.లక్ష్మి అవతారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అలంకరణ చేపట్టారు.అమ్మవారిని దర్శించుకున్న భక్తులను మంత్ర ముద్దులను చేస్తుంది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తుల తాకిడి పెరిగింది.ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భూముల రీ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

- అవగాహన సదస్సులో కరీంనగర్ ఏడి కిషన్ రావు..
- మూడు నెలల్లో సర్వే పూర్తి చేసేందుకు రైతులు సహకరించాలన్న తహసిల్దార్ కనకయ్య..



**చిగురుమామిడి అక్టోబర్ 17(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వే కార్యక్రమంలో భాగంగా శనివారం చిగురుమామిడి మండలంలోని ముదిమాణిక్యం,రామంచ గ్రామాలలో ఆయా గ్రామాల సర్పంచులు బోయిని రమేష్, ఒంటెల కిషన్ రెడ్డిల అధ్యక్షతన రైతన్నలకు శనివారం అవగాహన సదస్సులను నిర్వహించారు.ఈ సమావేశాలకు కరీంనగర్ ఏడి కిషన్ రావు, తహశీల్దార్ కనుకయ్యలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ఏడి కిషన్ రావు మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియలో భాగంగా మొదటగా గ్రామ సరిహద్దులను,ప్రభుత్వ భూములను,రాస్తాలను, కెనాల్స్, ఇతర శాఖల భూముల హద్దులను గుర్తిస్తామని తెలిపారు.అనంతరం ప్రతి రైతు సమక్షంలో అత్యాధునిక అక్షాంశాలు, రేఖాంశాలతో కూడిన డిజిటల్ కొలతలు నిర్వహిస్తామన్నారు.రైతుల నుండి ఆధార్,పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ నెంబర్లను సేకరించి,ప్రతి భూమికి ఒక తాత్కాలిక నెంబర్,భవిష్యత్తులో శాశ్వత భూ ఆధార్ కార్డును జారీ చేస్తామని వివరించారు.రికార్డులకు, క్షేత్రస్థాయి విస్తీర్ణానికి ఏవైనా తేడాలుంటే నోటీసులు జారీ చేస్తామని,నోటీసు అందిన 60రోజులలోపు టైటిల్ పత్రాలతో అప్పీల్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.తహశీల్దార్ కనుకయ్య మాట్లాడుతూ ఈ భూముల రీ సర్వే వల్ల భవిష్యత్తులో భూ ఆక్రమణలను సులభంగా పసిగట్టవచ్చని,రైతులు సర్వే ఆఫీసుల చుట్టూ తిరిగే తిప్పలు తప్పుతాయని తెలిపారు.రాబోయే మూడు నెలల్లో ఈ సర్వే ప్రక్రియను పూర్తి చేసేందుకు రైతులందరూ సర్వే సిబ్బందికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు.తమ గ్రామాలను ఈ ప్రాజెక్ట్ కోసం ముందుగా ఎంపిక చేసినందుకు సర్పంచులు ప్రభుత్వం, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిఐ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి తాటిపెల్లి పున్నంచందర్ రెడ్డి,మండల సర్వేయర్ బాలమురళీ కృష్ణ,ఆర్ఐ రజనీకాంత్ రెడ్డి,ఏఈఓ ప్రణయ్,స్థానిక ప్రజాప్రతినిధులు,పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## దుర్గమాత వద్ద పెద్ద ఎత్తున మహా అన్నప్రసాదం ఏర్పాటు

**ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచ్ అకవరం భవాని శివప్రసాద్**



**చిగురుమామిడి అక్టోబర్ 17 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని శ్రీరామాలయంలో ఏర్పాటు చేసిన దుర్గ మాత సన్నిధిలో చత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో శనివారం మహాఅన్నప్రసాద కార్యక్రమంను అత్యంత ఘనంగా నిర్వహించారు.గడ్డం సురేందర్ రెడ్డి,మంజుల అన్నదాతలుగా వ్యవహరించి వితరణ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్,సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించిన అనంతరం మాట్లాడుతూ చత్రపతి శివాజీ యువసేన సభ్యులు ఇలాంటి దైవకార్యాలు, సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. అన్నదాతల ఉదారత్వాన్ని వారు ప్రత్యేకంగా అభినందించారు.దుర్గ మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో దుర్గ మాత ఉత్సవ కమిటీ సభ్యులు, చత్రపతి శివాజీ యువసేన ప్రతినిధులు,ఆలయ అర్చకులు, భక్తులు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

# ఘనంగా భజన



**చొప్పదండి, అక్టోబర్ 17 (జనం సాక్షి):** చొప్పదండి పట్టణంలోని సంతోష్ నగర్ శివశక్తి గణపతి యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత మండపం వద్ద హనుమాన్ సాయి భక్త మార్కండేయ భజన మండలి సభ్యులు శుక్రవారం రాత్రి ఘనంగా భజన నిర్వహించారు. భజన భక్తులు పాడిన తమ పాటలతో అమ్మవారి నామస్మరణలతో ఆ ప్రాంతం భక్త పార్వతంలో నిండిపోయింది. అనంతరం సాయి మహిళా సేవా సమితి సభ్యులు చేసిన పారాయణం హనుమాన్ చాలీసా భక్తులను ఆకట్టుకుంది హనుమాన్ సాయి మరియు మార్కండేయ భజనమండలి సభ్యులు పిట్టల రఘు, దండె లింగన్న, దూస రాము, మంచికట్ల విఠల్, దండె కొమురయ్య, కొక్కుల మునిందర్, బత్తుల రవి, బ్రాహ్మణపెల్లి నాగరాజు, భోగ హరికిషన్, అనుమల్ల సుధాకర్, సీపెల్లి రాజు, స్వర్గం శ్రీనివాస్, వెంకటనర్సయ్య, తుమ్మ చంద్రశేఖర్, అనుమల్ల రాజేశం, పిట్టల లచ్చన్న, దండె రవిందర్, సాయి మహిళా సేవాసమితి సభ్యులు దండె లావణ్య, దూ లావణ్య, అరుణ, బ్రాహ్మణపెల్లి లత, తాటికొండ స్వప్న, పిట్టల పద్మావతి శివశక్తి యూత్ అసోసియేషన్ సభ్యులు బొడిగె మోహన్ బొడిగె వెంకటేష్ పొన్నం గౌరీ అడిగొప్పుల వెంకటేష్, కుటుంబ రాము, పొన్నం మహిపాల్, బండారి వీరమల్లు, పొన్నం పవన్, బొడిగె అజయ్ వరుణ్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఆయుష్ మిషన్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్. జి. ఎన్.అరుణ
- అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పోస్టుల భర్తీ
- అక్టోబర్ 22, నుంచి 27 వరకు దరఖాస్తుల స్వీకరణ

పెద్దపల్లి,అక్టోబర్ 17(జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లాలో జాతీయ ఆయుష్ మిషన్ కార్యక్రమం కింద ఆయుష్ పబ్లిక్ హెల్త్ ప్రోగ్రామ్‌లను నిర్వహించడానికి, తెలంగాణ సికింద్రాబాద్ ఆయుష్ శాఖ డైరెక్టర్ పరిపాలనా నియంత్రణలో పనిచేయుటకు అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ కేటగిరీల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా లిఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ జి.ఎన్. అరుణలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

- ఖాళీలు, వేతనం,అర్హతల వివరాలు : ఆయుష్ మెడికల్ ఆఫీసర్ 03 పోస్టులు

వేతనం: రూ. 40,000/- (నెలకు)

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ, బోర్డు నుండి ఆయుర్వేద, యునాని, హోమియోపతి, నేచురోపతి విధానంలో కనీసం 4 సంవత్సరాల క్రమబద్ధమైన విద్య నభ్యసించి, 1 సంవత్సరం విధిగా ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన డిగ్రీ కలిగి ఉండాలి.

ఫార్మాసిస్ట్ (01) పోస్ట్ వేతనం: రూ. 15,000 నెలకు

అర్హత: డి.ఫార్మసీ , బి.ఫార్మసీ, ఫార్మా-డి ఉత్తీర్ణులై ఉండాలని, తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌లో తప్పనిసరిగా రిజిస్టర్ అయి ఉండాలి.

సైకోసోషల్ కౌన్సెలర్ (01) పోస్ట్ ,వేతనం: రూ.500/- (ప్రతి సెషన్‌కు / సంవత్సరానికి కనీసం 200 విజిట్స్), అర్హత: మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (ఎమ్మెస్ డబ్ల్యూ) పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

యోగా ప్రొఫెషనల్ (01) పోస్ట్ ,వేతనం:రూ. 28,000/- (నెలకు), అర్హత: కనీసం 4 సంవత్సరాల క్రమబద్ధమైన విద్యతో పాటు 1 సంవత్సరం కంపల్సరీ ఇంటర్న్‌షిప్‌తో కూడిన నేచురోపతి డిగ్రీ, గుర్తింపు పొందిన యూనివర్సిటీ/బోర్డు నుండి 'డిప్లొమా ఇన్ నేచురోపతి అండ్ యోగిక్ సైన్సెస్ పూర్తి చేసి ఉండాలని సూచించారు అభ్యర్థుల వయస్సు 18 నుండి 44 సంవత్సరాల మధ్య ఉండాలి. (ఎస్సీ, ఎస్టీ, బిసి, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు 3 సంవత్సరాల వయోసడలింపు ఉంటుంది.దరఖాస్తు ఫారమ్, పూర్తి సూచనలను

హెచ్ పి టి పి ఎస్:/డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ// పెద్దపల్లి/తెలంగాణ గౌ ఇన్.

పెద్దపల్లి జిల్లా అధికారిక వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

దరఖాస్తు రుసుము రూ. 300/- డిమాండ్ డ్రాఫ్ట్ ( డిడి - ఎస్బిఐ అకౌంట్ నెంబర్ 45472549072) ను "గౌట్ హోమియో డిస్పెన్సరీ ధర్మారం. " పేరున తీసి దరఖాస్తుకు జతపరచాలి.నింపిన దరఖాస్తు ఫారమ్‌లను అవసరమైన సర్టిఫికెట్ల సెల్ఫ్-అటెస్టెడ్ జిరాక్స్ కాపీలతో సహా అక్టోబర్ 22, నుంచి 27 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పెద్దపల్లిలోని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో నేరుగా గానీ, రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా సమర్పించవచ్చని. గడువు దాటిన తర్వాత వచ్చే దరఖాస్తులు తిరస్కరించబడతాయని తెలిపారు.10వ తరగతి ,ఇంటర్మీడియట్ సర్టిఫికెట్, అర్హత పరీక్ష పాస్ సర్టిఫికెట్ అన్ని సంవత్సరాల మార్క్స్ మెమోలు, బోర్డ్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (మెడికల్ ఆఫీసర్లకు)

తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఫార్మాసిస్ట్ పోస్టుకు)



తహశీల్దార్ జారీ చేసిన కుల ధృవీకరణ పత్రం, 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు (ప్రైవేట్ అభ్యర్థులకు రెసిడెన్స్ సర్టిఫికెట్), దివ్యాంగులు (పి హెచ్) సర్టిఫికెట్ ఎక్స్-సర్వీస్‌మెన్ కోటా అభ్యర్థులకు సంబంధిత సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో అక్నాలెడ్జ్‌మెంట్ కార్డ్. అర్హత పరీక్షల్లో సాధించిన మార్కులు, వెయిటేజీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని, మెరిట్ జాబితాను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో ప్రచురించడం జరుగుతుందని జిల్లా ఆయుష్ నోడల్ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# దుర్గ మాత దయవల్ల ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

**- ఆరవవార్డులో దుర్గామాతను దర్శించుకున్న ప్రభుత్వ విప్ విజయ రమణారావు**

**- వార్డు కౌన్సిలర్ భాకం సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ**

**సుల్తానాబాద్,అక్టోబర్ 17(జనంసాక్షి) :**

దుర్గా మాతా దయవల్ల నియోజకవర్గ ప్రజలందరూ సుభిక్షంగా సుఖ సంతోషాలతో ఉండాలని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అమ్మవారిని వేడుకున్నారు.శుక్రవారం మున్సిపల్ పరిధిలోని ఆరవ వార్డు సుభాష్ నగర్ లో దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఆరవ వార్డు కౌన్సిలర్ బాకం సాయికిరణ్ యాదవ్ తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ, దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో సాంప్రదాయ పద్ధతులతో ఘనంగా జరుపుకోవాలని నిర్వాహకులకు సూచించారు.ఈ సందర్భంగా ఆరవ వార్డు మహిళలు సమస్యలను ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకువెళ్లగా, పరిష్కారం చేయాలని వార్డు కౌన్సిలర్ సాయి కిరణ్ యాదవ్ కు సూచించారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్



రాష్ట్ర నేత దుగ్యాల సంతోష్ రావు,రాకేష్ రెడ్డి, కౌన్సిలర్లు గాజుల రాజమల్లు,ఉట్ల వర ప్రదీప్,తొర్రి కొండ ప్రభాకర్,మాజీ వార్డు సభ్యులు అమిరి శెట్టి తిరుపతి,కాంగ్రెస్ నాయకులు గాదాసు రవీందర్, బిజెపి నేత కందునూరి కుమార్‌తోపాటు ఆరవ వార్డు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు న్యాతరి శ్యాంసుందర్, మామిడిపల్లి శ్రీకాంత్,న్యాతరి దేవేందర్ కుమార్, ఆరేపల్లి కిరణ్, ఆరెపల్లి హేమన్ రాజు,న్యాతరి దుర్గయ్య,నిర్వాహకులు ఆరేపల్లి రాకేష్ తోపాటు,ఆరవ వార్డు మహిళలు లలిత,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులుగా చిట్టవేణి సదయ్య నియామకం

**సుల్తానాబాద్,అక్టోబర్ 17(జనంసాక్షి) :**



భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్ గౌడ్ జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవ రెడ్డి,జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు చాతరాజు రమేష్ ఆధ్వర్యంలో బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా చిట్టవేణి సదయ్య యాదవ్ ను నియమించారు. ఈ,సందర్భంగా పెద్దపల్లి జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు చిట్టవేణి సదయ్య మాట్లాడుతూ, నానియామకానికి సహరించి ఆశీర్వదించిన పెద్దలు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్ గౌడ్ కి,మాజీ శాసన సభ్యులు గుజ్జుల రామకృష్ణ రెడ్డి కి, బిజెపి జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవ రెడ్డి కి, జిల్లా ప్రధాన కార్యదర్శులు కడారి అశోక్ రావు కి,పల్లె సదానందం కి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు చాతరాజు రమేష్ కి, సుల్తానాబాద్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు కూకట్ల నాగరాజు కి సహకరించిన బిజెపి నాయకులకు,కార్యకర్తలకు, మిత్రులకు అందరికీ పేరు పేరున జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు చిట్ట వేణి సదయ్య కృతజ్ఞతలు తెలిపారు.

## జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన సీఐ, ఎస్ ఐలను అరెస్టు చేసి ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**- తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపకులు ఆరెల్లి మల్లేష్, కట్కూరి మల్లేష్ డిమాండ్**

**పెద్దపల్లి,అక్టోబర్ 17(జనంసాక్షి) :**

ఏక్ ధం న్యూస్ జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన సీఐ, ఎస్ ఐలను వెంటనే అరెస్టు చేసి వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపకులు ఆరెల్లి మల్లేష్, కట్కూరి మల్లేష్ డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై పోలీసుల దాడి ఘటనను తీవ్రంగా పరిగణించాలన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏక్ ధం న్యూస్ ఎడిటర్ పొత్తూరి శేఖర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో రాతిపల్లి సంపత్‌లను శుక్రవారం పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.2026 అక్టోబర్ 12న రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో శేఖర్ డాక్టర్ బి ఆర్. అంబేద్కర్ స్టేడియంలో ఉండగా,ఓ కారులో వచ్చిన ఎస్ ఐ సిహెచ్.శ్రీకాంత్, సివిల్ డ్రెస్‌లో ఉన్న మరో ముగ్గురు వ్యక్తులు బలవంతంగా కారులోకి ఎక్కించుకొని తీసుకెళ్లారని, అక్కడే ఉన్న ఓ వ్యక్తి ఈ సంఘటనను మొబైల్‌లో వీడియో తీసే ప్రయత్నం చేస్తుండగా అతని ఫోన్‌ను సైతం లాక్కున్నారని,తమ మీదే వార్తలు రాస్తావా అంటూ ఎస్ ఐ శ్రీకాంత్‌తోపాటు కారులో ఉన్న మరో ముగ్గురు వ్యక్తులు కులం పేరుతో దూషిస్తూ తీవ్రంగా కొట్టారని, అనంతరం వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని బాధితులు తెలిపినట్లు వారు పేర్కొన్నారు.ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టులపై దాడులు జరగడం ఆందోళనకరమని పేర్కొన్నారు.ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, వాస్తవాల ఆధారంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. థర్డ్ డిగ్రీ ప్రయోగించిన సీఐ, ఎస్ ఐలను అరెస్టు చేసి, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి,బాధితులకు న్యాయం చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.వీరితోపాటు జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కాదాసి స్వామి,వివిధ సంఘాల నాయకులు సంకే రామ్మూర్తి,గసికంటి కుమార్ తదితరులున్నారు.

# పంటలు కాపాడేందుకే ఎస్సారెస్పీ నీటి విడుదల

- **ప్రభుత్వాన్ని ఒప్పించి సాగునీరు అందిస్తున్నాం**
- **ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయరమణ రావు**

**పెద్దపల్లి,అక్టోబర్ 17(జనంసాక్షి) :**

పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలకు డి-83, డి-86 ప్రధాన కాల్వల ద్వారా సరఫరా అవుతున్న సాగునీటిని పెద్దపల్లి పట్టణంలోని చందపల్లి ప్రధాన కాలువ వద్ద శు క్రవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించిన ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.కాల్వల ద్వారా నీటి సరఫరా తీరును పరిశీలించి,పంటలకు చివరి తడులు అందించాల్సిన ప్రస్తుత పరిస్థితులపై ప్రభుత్వ విప్ విజయరమణ రావు వివరాలు తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పంటలకు నీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని సంప్రదించి ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదలకు అంగీకారం పొందినట్లు వివరించారు.నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పటికీ రైతుల అవసరాలకు ప్రాధాన్యం ఇచ్చి సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చొరవ చూపిందన్నారు. రైతుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని, వారి పంటలను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తామని ప్రభుత్వ విప్ విజయరమణ రావు స్పష్టం చేశారు. సాగునీటి విషయంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు .రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని, ఆ దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. మరోవైపు, సాగునీటి



అంశంపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోకుండా విమర్శలు చేయడం సరికాదన్నారు.ఈ కార్యక్రమం లో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, పి ఎ సి ఎస్,చైర్మన్ ముత్యాల నరేష్,కౌన్సిలర్లు,సర్పంచ్లు మరియు మండల,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణిత సమయంలో కళ్యాణ లక్ష్మి షాది ముభారక్ చెక్కులు

**- రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి**

**- ఎల్ నినో ప్రభావంతో సాగునీటి కొరత ఉంటుంది**

**- వేసంగి లో వరిధాన్యం కు మించి మొక్కజొన్న మెరుగైన పంట**

**- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయరమణ రావు**




**పెద్దపల్లి,అక్టోబర్ 17(జనంసాక్షి) :** పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని ఆర్. కె గార్డెన్ లో పెద్దపల్లి పట్టణ మరియు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 63 మంది లబ్ధిదారులకు రూ.63,07,308/- విలువైన కళ్యాణ లక్ష్మి షాది ముభారక్ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేసిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో క్రమం తప్పకుండా కళ్యాణ లక్ష్మి షాది ముభారక్ చెక్కులను పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఎల్ నినో ప్రభావంతో సాగునీటి కొరత ఏర్పడిందని రైతులందరూ గమనించాలని రైతన్నలందరూ ఆరు తడి పంటల పట్ల దృష్టి సారించాలని కోరారు.ఈ సీజన్లో రైతుల పంట పొలాలకు సాగునీరు అందించడం కోసం జిల్లా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు నేతృత్వంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి పంట పొలాలకు సాగునీరు అందించడం జరిగిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుండి ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు.ఎల్ నీ నో ప్రభావం తో సాగునీరు కొరత తీవ్రంగా ఉంటుందని రైతన్నలు వరి సాగు కాకుండా మొక్కజొన్న, వేరుశనగ,పొద్దు తిరుగుడు,నువ్వులు,ఇతర పంటలు వేసుకోవాలని ఆ పంటలను ప్రభుత్వం తరుపున మద్దతు ధరతో కొనుగోలు చేసే బాధ్యత తనదే అని తెలిపారు. ముఖ్యంగా రైతులు మొక్కజొన్న బాగు చేస్తే ఎకరానికి 30 నుండి 40 క్వింటల దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాననీ క్వింటాలుకు 2400/-మద్దతు ధర ఉంటుందని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య,తహసీల్దార్ రాజయ్య,పిఏసిఎస్ చైర్మన్ ముత్యాల నరేష్,సిటీ కేబుల్ ఎండి సదానందం,సింగిల్ విండో డైరెక్టర్లు,మున్సిపల్ కౌన్సిలర్లు,పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.



## ఆస్పత్రికి వచ్చే రోగులకు వాలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

**-డాక్టర్ మారం తిరుపతి యాదవ్**

**-వాలంటీర్లకు వెన్నుదన్నుగా యాదవ చారిటబుల్**

**-కలెక్టర్ చేతుల మీదుగా వేతనాల పంపిణీ**

**పెద్దపల్లి,అక్టోబర్ 17(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో గత 15 నెలలుగా నిరుపేద రోగులకు విశేష సేవలందిస్తున్న వాలంటీర్లకు శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష చేతుల మీదుగా గౌరవ వేతనాలు అందజేశారు.ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ మారం తిరుపతి యాదవ్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నిరుపేదలకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడడంలో వాలంటీర్ల నిస్వార్థ కృషి వెలకట్టలేనిదని కొనియాడారు.సేవాభావంతో విధులు నిర్వహిస్తున్న వారి అంకితభావాన్ని గుర్తించి సమాజం తరపున వెన్నుతట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, వారిలో మరింత ఉత్సాహాన్ని,బాధ్యతాయుతమైన పనితీరును పెంపొందించేందుకే ఈ ప్రోత్సాహకాన్ని అందిస్తున్నామని స్పష్టం చేశారు.కేవలం వైద్య రంగానికే కాకుండా, ప్రజా సంక్షేమమే పరమావధిగా యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని విస్తృత సేవా కార్యక్రమాలు చేపడతామని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి సామ తిరుపతి యాదవ్‌తో పాటు ఆసుపత్రి వాలంటీర్లు,తదితరులు పాల్గొన్నారు.

## జనగణన ప్రక్రియను ఖచ్చితత్వంతో, పకడ్బందీగా నిర్వహించాలి

**- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు**




**పెద్దపల్లి,అక్టోబర్ 17(జనంసాక్షి) :** రానున్న రెండో విడత జనగణన ప్రక్రియను పకడ్బందీగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు సంబంధిత సిబ్బందికి సూచించారు. జనగణనలో భాగంగా ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వహించాలని తెలిపారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెండో విడత జనగణనకు సంబంధించి వర్క్స్ అండ్ టెక్నికల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలలో ప్రారంభం కానున్న జనగణన ప్రక్రియలో భాగంగా, ఇప్పటికే గృహాల జాబితా తయారీ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో తదుపరి చేపట్టనున్న జనాభా గణనకు సంబంధించి సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ జనగణన దేశ అభివృద్ధి ప్రణాళికలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనకు కీలకమైనదని తెలిపారు. జనాభా గణనలో సేకరించే వివరాలు ఖచ్చితంగా ఉండేలా సిబ్బంది బాధ్యతా యుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే పూర్తయిన గృహాల జాబితా ప్రక్రియను ఆధారంగా చేసుకుని, కేటాయించిన ప్రాంతాల్లోని ప్రతి కుటుంబాన్ని గుర్తించి జనాభా గణన చేపట్టాలని తెలిపారు. వివరాల నమోదు సమయంలో సందేహాలు తలెత్తితే సంబంధిత అధికారుల సూచనలు తీసుకోవాలని, సాంకేతిక పరికరాలు లేదా డిజిటల్ వ్యవస్థలను వినియోగించే సందర్భంలో శిక్షణలో సూచించిన విధానాలను అనుసరించాలని పేర్కొన్నారు.ప్రజల నుంచి సేకరించిన వ్యక్తిగత వివరాల గోప్యతను తప్పనిసరిగా కాపాడాలని, సమాచారాన్ని అనధికార వ్యక్తులతో పంచుకోకూడదని స్పష్టం చేశారు.జనగణనపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వారు సహకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జనగణన విధులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాలు, నిబంధనలు, నిర్ణీత గడువులను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, అప్పగించిన విధులను సమన్వయంతో నిర్వహించి జనగణన ప్రక్రియ విజయవంతమయ్యేలా కృషి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి.ప్రకాష్,సి సెక్షన్ పర్యవేక్షకులు కోటేశ్వర్,సెన్సస్ ట్రైనర్ వర్షిత,సంబంధిత అధికారులు,వర్క్స్ అండ్ టెక్నికల్ అసిస్టెంట్లు,తదితరులు పాల్గొన్నారు.

## వరి పంటలో కంకి నల్లి నివారణకు రైతులు అప్రమత్తంగా ఉండాలి

**- రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సంపత్ ఓదెల**

**పెద్దపల్లి,అక్టోబర్ 17(జనంసాక్షి) :** వరి పంటలో కంకి నల్లి (పానికల్ మైట్ / షీత్ మైట్) ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున పెద్దపల్లి జిల్లా రైతులు అప్రమత్తంగా ఉండి,తొలిదశలోనే నివారణ చర్యలు చేపట్టాలని రైతు విజ్ఞాన కేంద్రం (టి ఆర్ వి కే) శాస్త్రవేత్త, సమన్వయకర్త,ఎల్‌నినో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ సంపత్ ఓదెల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.వరి పంటలో కంకి నల్లి ఆశించినప్పుడు ఆకుల మధ్య ఈనెలపై, ఆకు తొడుగులపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయని, తీవ్రత పెరిగినప్పుడు కంకులు సరిగా అభివృద్ధి చెందకపోవడం, గింజలు పొల్లుగా మారడం, నల్లగా కావడం వంటి లక్షణాలు కనిపించి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఆయన వివరించారు. రైతులు పంటను క్రమం తప్పకుండా పరిశీలించాలని సూచించారు.

- గమనించాల్సిన లక్షణాలు : ఆకుల మధ్య ఈనెలపై గోధుమ రంగు లేదా నెక్రోటిక్ మచ్చలు కనిపించడం, ఆకు తొడుగులపై గోధుమ రంగు గాయాలు ఏర్పడటం.కంకి బయటకు వచ్చే దశలో ఉధృతి అధికమైతే గింజలు సరిగా నిండకపోవడం,కొన్ని గింజలు రంగు మారి, పొల్లుగా లేదా నల్లగా మారడం.



- నివారణ మరియు యాజమాన్య చర్యలు : గరిష్ఠ పిలకల దశ నుంచి అంకుర కంకి, కంకి బయటకు వచ్చే దశ వరకు పొలాన్ని క్రమం తప్పకుండా పరిశీలించాలి.పొలంలో కలుపు మొక్కలను, పంట కోత అనంతరం మిగిలిన అవశేషాలను పరిశుభ్రంగా తొలగించాలి.నత్రజని ఎరువులను పరిమితికి మించకుండా, సిఫార్సు చేసిన మోతాదులో సమతుల్యంగా వాడాలి.పురుగు ఉధృతి ఆధారంగా సస్యరక్షణ మందులను మాత్రమే పిచికారీ చేయాలి.

- రసాయన యాజమాన్యం : వరి పానికల్ మైట్ నివారణకు క్రింది మందులను సూచించడమైనది :(స్పైరోమెసిఫెన్) 1 మి.లీ. లీటరు నీటికి.(డైకోఫాల్): 5 మి.లీ. లీటరు నీటికి.మందుల ఎంపికలో పంట దశ, అనుమతించబడిన మోతాదులను గమనించాలి.రెండు మందులను కలిపి పిచికారీ చేయకూడదు.రైతులు స్వయంగా మోతాదులను పెంచకుండా,స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓ)వ్యవసాయ శాస్త్రవేత్తలను సంప్రదించి సలహాలు పాటించాలని డాక్టర్ సంపత్ ఓదెల కోరారు.

## కుర్మ పల్లె గ్రామానికి టిబి ముక్త్ పంచాయతీ అవార్డు రావటం సంతోషం

**- సర్పంచ్ గొర్రె లక్ష్మి-రాయ లింగు యాదవ్**

**పెద్దపల్లి,అక్టోబర్ 17(జనంసాక్షి) :** పెద్దపల్లి మండలం కురుమ పల్లె గ్రామంలో టిబి రహిత గ్రామంగా 2025 వ సంవత్సరంలో ఒక్క పాజిటివ్ లేనందున టిబి ముక్త్ పంచాయతీ అవార్డు రావడం సంతోషంగా ఉందని గ్రామ సర్పంచ్ పేర్కొన్నారు. అవార్డు వచ్చిన సందర్భంగా గ్రామ ఎఎన్ఎం రజిని, ఆశ లత ను అభినందిస్తూ వారి శ్రమ ఎంతో గొప్పదని వారి సేవలను అభినందిస్తూ సర్పంచ్ గొర్రె లక్ష్మి-రాయ లింగు యాదవ్,ఉప సర్పంచ్ బీటీ అశోక్ లు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ బి.రజిత,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

